PRAMUKHANDHRA 28th Year of Publication We carry the news and views of Telugus

28 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర

₹.15

జూలై 2022



వ్యవస్థాపకులు

శ్రీ గోటేటి శ్రీరామారావు

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA





సత్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మితే విజయం తథ్యం.
నెమ్మదిగానైనా సరే. మనం జయించక తప్పదు.

దృఢ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయి.
వీటిని గ్రహించినవారు విఘ్నాలను ప్రతిఘటించి నిలువగలరు.

నమ:శ్రీ యతిరాజాయ వివేకానంద శూరయే ।
సచ్చిత్ సుఖస్వరూపాయ స్వామినే తాపహారిణే ॥

యతిరాజా, యథార్థ జ్ఞానమూర్తీ, సమస్త దు:ఖాలను బాపువారైన వివేకానంద ఋషివరేణ్యునికి ప్రణమిల్లుతున్నాను.

– గోటేటి వెంకటేశ్వరరావు



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూలై 2022

సంపుటి : 28 **331** సంచిక : 7




## విద్యా విధానాన్ని ప్రక్షాళన చేయండి!

నమో దేవీ మహా విద్యే వేదమాతః పరాత్పరే
వ్యాహృత్యాది మహామంత్ర రూపే ప్రణవరూపిణీ!

– ఆ ప్రణవరూపిణే వాగ్దేవత. ఆమే వాణీ, సరస్వతీ, భారతీ, భగవతీ, సావిత్రీ, గాయత్రీ! సర్వమూ ఆ తల్లియే! ఆమె అనుగ్రహం తోనే వేదాలు వర్థిల్లాయ్, ఉపనిషత్తులు పుట్టాయ్. ధర్మం పుట్టింది, సత్యం పుట్టింది, శీలం పుట్టింది. విజ్ఞానోదయం అయింది.

భారతదేశం ప్రపంచ దేశాలకు విజ్ఞానాన్నీ, శాస్త్రాన్నీ (Science), గ్రహగతుల్నీ బోధించింది. ప్రపంచ విజ్ఞానంలో గురుస్థానంలో ఉన్నది. సత్యం వద ధర్మం చెర – యని బోధించింది కూడా భారతదేశమే! ఇప్పటికే అమెరికన్ పాఠశాలల్లో TELL TRUTH యని బడిలోని పిల్లలకు బోధిస్తున్నారంటే – భారతీయ తత్వమైన సత్యం ఎంతవరకూ ప్రాకిందో తెలుసుకోగలరు!

అలనాటి భారత గురుకులాల్లో పిల్లలకు ప్రణవం తరువాత నేర్పేది సత్యమే! సత్యమే జయం. సత్యం వినా మాట్లాడవద్దని చెప్పేవారు. తరువాత ధర్మం బోధించేవారు. దీనితో పిల్లలు జ్ఞానవంతులై, నైతిక విలువలు గల విద్యతో గృహాలకు చేరేవారు. ఈనాటి విద్యావిధానం వాటన్నిటినీ బుగ్గి చేసింది. భగవాన్ సత్యసాయి నుడివినట్టు:

**ధనమే దైవంబయ్యె దర్పంబె మతమయ్యె**
**స్వార్థమే బుద్ధికి స్థానమయ్యె**
**అహము శ్వాసంబయ్యె ఆశలందంబయ్యె**
**ధర్మంలో వమ్మయ్యె ధాత్రిలోన**
**దయయు హీనంబయ్యె నయము శూన్యంబయ్యె**
**కపటమే జీవిత కాంతులయ్యె**
**ప్రేమానురాగముల్ రోగాల పాలయ్యె**
**కామాంధుని చేసె కలిని చదువు**
**బ్రతుకు బరువయ్యె మతులు గతులు తప్పె**
**జాగుచేసిన జగతికే గతియు నౌనో!**
**విద్యయందు విధిగా నైతకము చేర్చి**
**భరత సంస్కృతిని మీరు బదయరయ్య!**

– శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ కాన్వొకేషన్ సందర్భములో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్ పర్సన్ శ్రీమతి మాధురిషా వేదికనలంకరించినపుడు భగవాన్ ఆశువుగా చెప్పారు.

ఈనాడు చదువుకుంటున్న విద్యా విధానంలో నైతిక విలువలు సున్న. పైగా పిల్లలకు సెక్సు బోధించాలనే ప్రతిపాదనం ప్రభుత్వ విద్యా విధానంలో ప్రతిపాదిస్తున్నట్టు వింటూన్నాం. ఇప్పటికే కలకత్తా, బొంబాయి, ఢిల్లీ విశ్వవిద్యాలయాల్లో నలభై శాతం విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యములు క్షీణించినట్టు వైద్యశాస్త్రజ్ఞులే పరిశీలించి చెబుతున్నారు.

బండెడు పుస్తకాలతో, కుండెడు అనైతికత్వాన్ని విద్యార్థుల రక్తంలోకి ఎక్కిస్తున్నారు. ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ధార్మిక, నైతిక విలువలు విద్యార్థుల కవసరమని ఏ నాయకుడూ, ఏ విద్యావేత్తయూ గ్రహించడం లేదు.

విద్యార్థుల్లో హత్యలు పెరిగాయ్, ఆత్మహత్యలు పెరిగాయ్, రాజకీయాలు పెరిగాయ్. విధ్వంస కార్యాలకు కూడా సుముఖులవుతున్నారు. విద్యార్జన అనేదాన్ని వెనుకకు నెడుతున్నారు. ఇలా కాలాన్ని నెట్టుకుని పోతూంటుంటే దేశ భవిష్యత్తు ఏమవుతుంది?

రాజకీయ పెద్దలారా! మీరెలాగూ పరస్పర వైషమ్యాలతో, కుల ప్రాంతీయ తత్వాలతో కలుషితమైపోయారు. విద్యా విధానాన్నీ, విద్యార్థుల్నీ మీ కాలుష్యంలో మునగనీయకండి.

ప్రాచీన గురుకులముల్లో తర్ఫీదు నిచ్చే వినయము, ఇంద్రియ నిగ్రహము, సత్‌శీలమూ నేటి యువతరానికీ, దేశ భవిష్యత్తుకూ ప్రధాన అవసరమని గుర్తించండి.



బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

(జూలై 2010)

### వివేకానంద స్వామీ నీవు మళ్లీ పుట్టాలి!

యువకులు వివేకజ్ఞత, దేశభక్తి కలిగి, భావి భారత భాగ్యోదయానికి పునాదులు వేయవలసిన సమయం వచ్చింది.

రామకృష్ణ పరమహంస వంటి గురువులూ, శారదామాత వంటి తల్లులూ, నీవంటి దేశభక్తిధీరత గల ఒక్క వివేకానందుడు పుట్టిననూ, భరతవర్షం పునర్వైభవాన్ని పొందుతుంది. నీవు మళ్లీ పుట్టాలి స్వామీ!


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




# వకుళమాత ఆలయంలో లభించిన శిలాశాసనం తొలి చారిత్రికాధారం

తిరుపతి వద్ద, బెంగుళూరు జాతీయ రహదారిలో పేరూరు సమీపంలో ఉన్న వకుళమాత ఆలయానికి సంబంధించి తొలి చారిత్రిక ఆధారం లభించింది. ఇటీవలే ఎపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా పునరుద్ధరణ పూర్తిచేసుకున్న ఈ గుడి ఆవరణలో తమిళ లిపిలో ఉన్న శాసనం కనుగొన్నట్లు భారత పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. క్రీ.శ. 1198 నాటి మూడవ కులోత్తుంగ చోళుని ఇరవయ్యవ పాలనాకాలానికి చెందినదిగా దీనిని గుర్తించినట్లు వారు తెలిపారు. ఈ శాసనం కొంత దెబ్బతిని ఉన్నట్టు తెలిపారు. తమిళశాసనం పైన ఫోటోలో చూడవచ్చు దాని తెలుగు అనువాదం...

**1. స్వస్తిశ్రీ త్రిభువన చక్రవర్తిగళ్**
**శ్రీ కులోత్తుంగచోళ దేవర్కు**
**యాండు ఉయవదు**

**2. జయంకొండ చోళ మండలత్తు తిరువేంగడ**
**క్కొట్టత్తు కుడపూర్ నాట్టు**
**త్తలైయూర్ పెరూరల్ అంజాదవిణ్ణకర**

**3. కొయిలిలే అంజాద విణ్ణప్పెరుమాళైయుమ్**
**వీరాబ్దియారైయుమెయుందరుళువిత్తైన్ పులియూర్**

**4. కొట్టత్తు పన్మయిలిరుక్కుమ్ (పాన)...**
**కు స ... తా... ందార్...న్**

**5. ఇప్పె ...**

దీని భావం.. రెండు దేవతా విగ్రహాలను ఈ గుడిలో పులియూర్ కొట్టం ప్రాంతీయుడు ప్రతిష్టగావించినట్లు తెలియజేస్తోంది. జయన్ గొండచోళ మండలం లోని తిరువేంగడకొట్టం నందలి కుడవూర్నడులోని తలయ్యూర్–పేరూర్ అనబడే నేటి పేరూరు నందు, అప్పట్లో అంచాడవిన్నకర్ ఆలయం అని పిలువబడిన నేటి వకుళమాత గుడిలో అంచాడవిన్నకర పెరుమాళ్ ఆయన దేవి (సతీమణి) యార్ల విగ్రహాలను పులియూర్ కొట్టం నివాసి ప్రతిష్ట గావించినట్లు ఈ శాసనం తెలియ జేస్తోంది. దీనితో క్రీ.శ. 1200 నాటికే ఇక్కడో ఆలయం ఉండేదనే చారిత్రిక ఆధారం లభించినట్టయ్యిందన్నారు. తిరుపతికి దక్షిణంగా మూడు మైళ్ల దూరంలో ఉండే తిరుచానూరు సమీపం, యోగి మల్లవరంలోని శివాలయంలో లభించిన శాసనాల ద్వారా చోళరాజ్యంలో సామంతుగా ఈ ప్రాంతాన్ని రెండవ వీరభల్లాలుడు క్రీ.శ. 1173 నుంచి క్రీ.శ. 1220 పాలించినట్లు ఆధారాలున్నారు. ఈ వీరభల్లాలుని కుమార్తె సోమలాదేవిని మూడవ కులోత్తుంగచోళ మహారాజు వివాహం చేసుకున్నాడు.

## వివాదం ఏమిటి?

తిరుపతికి సమీపంలోని పేరూరు ప్రాంతంలో బండరాళ్ల మైనింగ్ జరిగేది ఈ మైనింగ్ మాపియా చివరకు 50 ఎకరాల విస్తీర్ణంలోని వకులాలయం కూడా కబళించింది. కొన్ని వందల సంవత్సరాలుగా శిథిలమై వున్న ఈ గుడిని గురించి టిటిడిగానీ, ఏపీ ప్రభుత్వం గానీ, పురావస్తు శాఖ గానీ పట్టించుకోలేదు. దీనితో 2009 ప్రాంతరం కొందరు సమీప గ్రామాల వారు కోర్టుకు వెళ్లి మైనింగ్ ఆపాలని, గుడిని రక్షించాలనీ ప్రయత్నం చేశారు. వీరికి పరిపూర్ణానంద స్వామి, బీజేపీ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి మద్దతు తెలిపారు. దీనితో కొన్ని హైందవ సంఘాలు కూడా గొంతు కలపడంతో సమస్య పెద్దదైంది. టిటిడి కూడా అటు దృష్టి పెట్టింది. 2012లో కోర్టు ఆదేశాలమేరకు రూ.2 కోట్ల వ్యయంతో శిథిల ఆలయం చుట్టూ కంచె నిర్మించి, ఆలయాన్ని పునరించాలని భావించింది. చివరకు 2017లో 'ఆలయం పునర్నిర్మాణానికి పునాది పడింది. ఇటీవల జగన్ ప్రభుత్వం వచ్చిం తరువాత ఉమ్మడి చిత్తూరు జిల్లా మంత్రి. పీలేరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి స్వయంగా ఈ ఆలయం నిర్మాణం బాధ్యత తీసుకున్నారు. స్వంత నిధులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా 18 కోట్ల వ్యయంతో గర్భగృహశిఖరానికి బంగారు తొడుగు కూడా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఆలయం పరిసరాల్లో 83.42 ఎకరాలు స్థలం చేకరించి, టిటిడికి అప్పగించారు.

## పురాణ కథనం...

భువిపై దుష్టసంహారం చేయడానికి శ్రీమహావిష్ణువు అనేక అవతారాలు దాల్చిన విషయం మనకు తెలుసు. అట్లా శ్రీకృష్ణావతారంలో దేవకీ సుతుడుగా ఇలలో జన్మించినా, ఆయన పెరిగిందంతా గోకులంలో యశోద చెంతనే అయినా, కృష్ణావతారంలో ఆయన అష్ట వివాహాలు చేసుకున్నా పెంపుడు తల్లి యశోదకు ఒక్క వివాహమూ చూచి తరించే భాగ్యం కలగలేదు. దీనితో విచారిస్తున్న యశోదకు అమ్మా నేను కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడుగా శేషాచలంపై అవతరిస్తాను. అపుడు పద్మావతితో నా వివాహం నీచేతుల మీదుగానే రుగుతుందని శ్రీకృష్ణభగవానుడు వరంగా ప్రసాదిస్తాడు. ఆ మేరకు యశోద వకుళ పేరుతో తిరుమలలో ఉండగానే గాయపడ్డ శ్రీనివాసుడు ఆమెను కలుసుకోవడం, తరువాత ఆకాశరాజుకు మార్గ పద్మావతితో వకుళ ఆధ్వర్యంలో వివాహం జరిపించడం వంటివి మనం వేంకటేశ్వర మహాత్యం ద్వారా తెలుసుకోవచ్చు. అట్లా శ్రీనివాసుని తల్లిగా ప్రసిద్ధమైన వకుళ ఆలయం పేరూరు వద్ద చాలా దశాబ్దాల కాలంగా శిథిలమైపోయిది సుమారు 16వ శతాబ్దంలో మహ్మదీయుల దాడిలో ప్రాభవం కోల్పోయిన ఈ ఆలయం 21వ శతాబ్దంలో తిరిగి భక్తుల సందర్శనకు నోచుకోవడం విశేషం.

## మళ్లీ మొదలైన భక్తుల సందడి...

2022 జూన్ 18 నుంచి 23 వరకు వకుళ ఆలయం మహాసంప్రోక్షణ జరిగింది. 24 వ తేదీ నుంచి భక్తులకు ఆలయం అందుబాటులోకి వచ్చింది. తిరుపతి నుంచి 5 కిమీ దూరంలో తిరుపతి– బెంగుళూరు జాతీయ రహదారిపై నెలకొన్న ఈ వకుళ మాత ఆలయం నేడు. భక్తులను ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలో భక్తులు సందర్శిస్తున్నారు.

– డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్



# ఋషి ఋణం తీర్చుకునే అవకాశం

మహోన్నతమైన సంస్కృతీ సంప్రదాయాలతో శోభిల్లుతున్న మన భారతదేశం ఒక గొప్ప ఆధ్యాత్మిక శక్తి కేంద్రం. అనంతమైన జ్ఞాన సంపదకూ, శ్రేష్ఠ ధర్మాలకూ పుట్టినిల్లయిన మనదేశం వేదభూమిగా, కర్మభూమిగా, జ్ఞానభూమిగా ప్రసిద్ధి చెందింది. అనేక దేశాల వారికి జ్ఞానప్రదాతగా, ఆచార సాంప్రదాయ విషయాలలో దిక్సూచిగా గుర్తించబడుతుంది. ఇంతటి మహోన్నతమైన గుర్తింపుకూ, వైభవానికి కారణం - భగవాన్ శ్రీ వేదవ్యాసుల వారు అందించిన జ్ఞానమే అన్నది లోకవిదితమే.

**వ్యాసాయ విష్ణురూపాయ**
**వ్యాసరూపాయ విష్ణవే**
**నమో వై బ్రహ్మనిధయే**
**వాసిష్ఠాయ నమో నమః**

సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు యొక్క 24 అవతారాలలో 17వ అవతారం వ్యాసావతారం. మిగిలిన అవతారాల కంటే వ్యాసావతారం ఎంతో విశిష్టమైన అవతారం. ఎందుకంటే 84 లక్షల జీవరాసులలో కేవలము మనిషి మాత్రమే తన దుఃఖం నుండి బయటపడి సుఖంగా, శాంతిగా జీవిస్తూ మానవజన్మ లక్ష్యమైన మోక్షం పొందటానికి వీలవుతుంది. అందుకు ఆచరించవలసిన ధర్మాలను తెలుసుకోవలసిన జ్ఞానాన్ని అందజేయడం కొరకు భగవంతుడు ప్రత్యేకంగా వేదవ్యాసునిగా అవతరించారు. అంతేగాక ఆయా ధర్మాలను ఆచరించటానికి కావలసిన శక్తిని మనకు ప్రసాదించటానికీ, దుఃఖానికి కారణమైన అజ్ఞానాన్ని పోగొట్టుకోవడానికి కావలసిన ప్రేరణ అందించడానికీ వ్యాసుల వారు ఎల్లవేళలా మనకు తోడుగా ఉంటారు. ఎందుకంటే, వారు చిరంజీవులు కాబట్టి. మిగిలిన కొన్ని అవతారాలవలే వ్యాసావతారాన్ని చాలించటమన్నది లేనేలేదు.

మనిషిగా మనం ఏయే ధర్మాలు ఆచరించాలో, మన జన్మ సార్థకం చేసుకోవటానికి ఏ జ్ఞానం తెలుసుకోవాలో అవన్నీ కూడా ఎంతో విపులంగా, ఎన్నో గ్రంథాల ద్వారా వ్యాస భగవానుల వారు మనకందించారు.

మహాసముద్రంలా ఉన్న వేదరాశిని వ్యాసభగవానుల వారు ఋక్, యజుస్, సామ, అధర్వణ వేదాలుగా విభజనచేసి, మహత్తరమైన వేదజ్ఞానం మనిషి అందుకోవడానికి వీలు కలిగించారు. ఈ చతుర్వేద విభజన వల్ల మనిషి చతుర్వేదా లతో పాటు మహోన్నతమైన ఉపనిషత్తులు, ఉపవేదాలైన ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వ వేదము, అర్థవేదము పొందటానికి వీలైంది.

ఈవిధమైన విభజన వల్ల వేదాలు, ఉపనిషత్తులు, ఉపవేదాలు మనకు ఎంతో ఉపయోగకారులుగా మారినాయి.

ఎంతో జ్ఞానంతో కూడిన ఆధ్యాత్మ రామాయణము, అష్టాదశ పురాణాలు, బ్రహ్మసూత్రాలు, వ్యాససంహిత, వ్యాసస్మృతి అనే మహత్తరమైన గ్రంథాలను మానవాళికి అందించారు. ఈ గ్రంథాలన్నింటి సారమూ అనేక ధర్మాలతో కలిపి మహోన్నతమైన, పంచమవేదమైన మహాభారతాన్ని మనకోసం అందించారు.

ప్రత్యేకించి కలియుగంలోని మన కొరకు భక్తి రసామృతమైన భాగవతాన్ని అందించారు.

ఏరోజు, ఏగుడిలో, ఏదేవుడిని పూజిస్తున్నా అక్కడ మనం వినే మంత్రాలు వ్యాసుల వారు అందించినవే కదా! ఎవరు ఏపూజ చేస్తున్నా, ఏదేవుడిని ఆరాధిస్తున్నా, ఏఆచారాన్ని పాటిస్తున్నా, ఏ సంప్రదాయంలో ఉన్నా అవన్నీ వేదవ్యాసుల వారందించినవే కదా!

ఆరాధన, భక్తి, జ్ఞానము, యోగము, యజ్ఞము, ధ్యానము, తపస్సు, స్మరణ, సాధన.... ఇవన్నీ కూడా వేదవ్యాసులవారు అందించిన శాస్త్రాల నుండి పొందుతున్నవే కదా? ధర్మాధర్మాల గురించి ఎవరు మాట్లాడుతున్నా అవన్నీ వ్యాసుల వారు అందించిన శాస్త్రాలలోనివే కదా! ఎవరు ఏ యజ్ఞం చేసినా, ఏ హోమం చేసినా అవన్నీ కూడా వ్యాసుల వారు అందించిన శాస్త్రాలలో తెలుసుకున్నవే కదా!

గర్భిణీ స్త్రీలకు చేసే సీమంతం దగ్గర్నుంచీ మనిషి చనిపోయిన తర్వాత చేసే కర్మకాండ వరకూ ప్రతిదీ వ్యాసుల వారందించిన శాస్త్రాల నుండి మనం తెలుసుకున్నదే కదా!

శంకుస్థాపన, గృహప్రవేశము, వివాహము ఇలా ఎన్నో శుభకార్యాలకూ, అశుభకార్యాలకూ అవసరమైన వేదమంత్రాలన్నీ వేదవ్యాసుల వారు అందించిన శాస్త్రాలలోనివే కదా! మనము ఆచరించే ధర్మాలు, సంప్రదాయాలు, నియమ నిష్టల నుండి మనము ఉపయోగించుకునే ఆయుర్వేదము వరకు ప్రతిదీ కూడా వ్యాస ప్రసాదమే కదా! వ్యాసుల వారు అందించిన జ్ఞానమే లేకపోతే మనిషి మనుగడకు అర్థంలేదు. ప్రతిక్షణమూ మనము వ్యాసప్రసాదం మీద ఆధారపడి బ్రతుకుతున్నాము.

తెలిసినా తెలియకపోయినా ఇది సత్యం, సత్యం, సత్యం?

పుట్టిన ప్రతివారూ కూడా భగవాన్ శ్రీవేదవ్యాసుల వారు అందించిన జ్ఞానం ఎంతో కొంత, ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగించుకుంటున్నారు అనటంలో ఏ అతిశయోక్తి లేదు.

భగవాన్ శ్రీవేదవ్యాసుల వారికి ఎంతగానో ఋణపడి ఉన్నాము కదా!

కేవలము మన దుఃఖాన్ని పోగొట్టటం కొరకు అవతరించి, మన సుఖశాంతుల కోసం తపనపడుతూ ఇన్ని గ్రంథాలు మనకు అందించిన భగవాన్ శ్రీవేదవ్యాసుల వారి అవతార తత్వాన్ని, వారి అవతార విశిష్టతను అవగాహన చేసుకొని ఆ తండ్రిని శరణు వేడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారందించిన ధర్మాలను, మహోన్నతమైన జ్ఞానాన్ని, భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందికదా!

ఆ తండ్రిని కృతజ్ఞతాపూర్వకంగా ఆరాధించినప్పుడే ఆ తండ్రి అందించిన జ్ఞానాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకోగలుగుతాము. ఆ తండ్రిని శరణువేడినప్పుడే వారు అందించిన ధర్మాలను సరైన రీతిలో ఆచరించగలుగుతాము.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అనంతమైన జ్ఞానాన్ని మనకోసం, మన సుఖశాంతుల కోసం అందించిన భగవాన్ శ్రీవేదవ్యాసుల వారిని కృతజ్ఞతాపూర్వకంగా ఆరాధించుకోవటానికి ఒక్క వ్యాసదేవాలయమైనా అందుబాటులో కనిపించటంలేదు.

సేకరణ: **ఆధ్యాత్మిక భక్తిప్రపంచం**
**శ్రీ భవఘ్ని గురుదేవులు**
భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రము, వైకుంఠపురం, గుంటూరు జిల్లా


SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# ఎల్.ఆర్. ఈశ్వరి

సంగీత ప్రపంచంలో అయిదు దశాబ్దాలకుపైగా పాటలు పాడి కోట్లాదిమంది అభిమానాన్ని సంతరించుకున్న గాయనిగా వినుతికెక్కారు ఎల్. ఆర్. ఈశ్వరిగారు.

అది "ఎలంద పళం "కానివ్వండి....కళాశలా కళాశలా.... అవనివ్వండీ.... ఆవిడ గొంతులో పాట వింటుంటే... ఆ అనుభూతీ, ఆ ఆనందమూ వేరు.

నేను ఆవిడ పాటలు తమిళంలోనే ఎక్కువగా విన్నాను. అమ్మవారిమీద ఆవిడ పాటలు అనేకం. తమిళనాడులో ఆ పాటలకు విశేష ఆదరణ ఉండేది. ఇప్పటికీ ఉందికూడా. చెల్లాత్తా, కర్పూర నాయగి వంటి భక్తి పాటలు ఎంతో ఫేమస్. ఆవిడ క్రిస్మస్ పాటలుకూడా పాడారు. వరువాయ్ వరువాయ్, దైవం తంద దివ్య కుమరన్ వంటి పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ క్రిస్మస్ పాటలకు డాక్టర్ ఆనంద్ చెల్లప్ప సంగీతం సమకూర్చారు.

ఆవిడ పూర్తి పేరు Lourde - Mary Rajeswari. అయితే ఆవిడ ఎల్. ఆర్. ఈశ్వరిగానే బాగా పాపులర్ అయ్యారు. నేపథ్యగాయనిగా ఇవిడ తమిళం, తెలుగు మళయాలం, కన్నడం, హిందీ, తుళు, ఇంగ్లీష్‌లలో అనేక పాటలు పాడారు. ఆవిడను తమిళనాడు ప్రభుత్వం కళైమామణి అవార్డుతో సత్కరించింది. హిందీలో ఆవిడ ఒకే ఒక్క పాట పాడారు. Pistolwali సినిమాలో "Udati Si Chidiya" అనే పాట పాడారు. తెలుగులో జ్యోతిలక్ష్మి నటించిన పిల్లా పిడుగ సినిమాను హిందీలో డబ్ చేసిన సినిమా ఇది.

ఎం.ఎస్. విశ్వనాథన్, టి.కె. రామమూర్తి, కె.వి. మహదేవన్, వేదా, వి.కుమార్, శంకర్ – గణేశ్, జి.కె. వెంకటేష్, కున్నైక్కుడి వైద్యనాథన్ తదితర సంగీతదర్శకత్వంలో ఆమె విభిన్న పాటలు పాడారు.

తమిళంలో పాసమలర్ అనే సినిమాలో ఆవిడ పాడిన వారాయ తోయి వారాయో...అనే పాటను కళ్యాణమండపాలలో తప్పకుండా వినిపించేవారు.

ఆవిడను ఒకానొకప్పుడు ఎస్.ఎస్. జైన్ కళాశాలకు చెందిన ముగ్గురు యువతులు పూజా, మీనా, వినూ కలిసి ఇంటర్వ్యూ చేశారు.

ఆ ఇంటర్వ్యూ నేను చదివింది తమిళంలో. బాగుందనిపించింది. ఆవిడ పాడిన పాటలు తెలుగువారికికూడా పరిచయమే కనుక ఆ ఇంటర్వ్యూలో ఆవిడ చెప్పిన విషయాలను చెప్పాలనిపించి అనుసృజించాను.

*రండి అమ్మాయిలూ అంటూ ఎంతో ప్రేమగా ఆహ్వానించిన ఈశ్వరిగారు వారితో పంచుకున్న విషయాలను ఆమె మాటల్లోనే చూద్దాం...*

మా అమ్మ వాళ్ళ నాన్నగారి సొంత ఊరు పరమకుడి. మా నాన్నగారి స్వస్థలం చెన్నై.

నేను పుట్టింది, పెరిగింది, సినిమాలోకి ప్రవేశించి పేరుప్రఖ్యాతులు పొందిందంతా చెన్నైలోనే.

మేము చెన్నైలోని పుదుప్పేట్టయ్‌లో నివసించేవాళ్ళం.

మాది చాలా సాధారణ కుటుంబం. అమ్మ పేరు రెజీనా మేరీ నిర్మలా. తండ్రి పేరు ఆంటనీ దేవరాజ్. ఆయన స్పెన్సర్స్ అండ్ కంపెనీలో టైపింగ్, షార్ట్ హ్యాండ్ అంతా తెలిసిన వ్యక్తిగా పని చేశారు. ఆయన రోజూ సైకిలుమీదే ఆఫీసుకి వెళ్ళి వచ్చారనేది నాకు గుర్తుంది. మరేదీ జ్ఞాపకం లేదు. కారణం ఆయన నా ఆరో ఏట మరణించారు. ఆయన చాలా అనారోగ్యంతో బాధపడ్డారు. ఆయన ఏ జబ్బుతో బాధపడ్డారనేది కూడా నాకు గుర్తు లేదు.

ఆయనకు ఏడెనిమిది ఆపరేషన్లయ్యాయి. డాక్టర్ బొమ్మయ్యా ఆయనకు వైద్యచికిత్సలు చేశారనీ జ్ఞాపకముంది. ఆయనకు చికిత్స కోసం మా అమ్మ చాలా ఖర్చు చేయవలసి వచ్చింది. ఇంట్లో ఉన్న నగలతో డబ్బులు తీసుకుని ఆయన వైద్యానికి ఖర్చు చేసినట్టూ అమ్మ చెప్తుండేవారు.

ఆయన మమ్మల్ని వదిలిపెట్టిపోయినప్పుడు మా అమ్మ మెడలో ఒక్క పసుపు తాడు మాత్రమే. మా తాహతుకి మించి ఖర్చు చేసినప్పటికీ నాన్నను కాపాడుకోలేక పోయాం అని చాలాసార్లు బాధపడ్డ రోజులున్నాయి. అప్పట్లో మా సొంతవాళ్ళెవరూ సాయం చేయడానికి ముందుకురాలేదు.

మా ఇంట నేను పెద్దదాన్ని. నాకొక తమ్ముడు. అతని పేరు అమల్ రాజ్. తర్వాత ఒక చెల్లెలు. ఆమె పేరు అంజలి.

మా నాన్నగారు చనిపోయినప్పుడు తమ్ముడికి అయిదేళ్ళు. చెల్లికి రెండేళ్ళు.

నేను ఎగ్మూరులో ఉన్న ప్రెసిడెన్సీ బాలికల స్కూల్లో చదువుకున్నాను.

నా తమ్ముడు చింతాద్రిపేటలోని స్కూల్లో చదివాడు. మా నాన్న పోయిన తర్వాత మా కుటుంబాన్ని ఆదుకున్నది మా అమ్మ గాత్రమే. మా అమ్మ బాగా పాడేవారు. మా నాన్నగారు జబ్బుపడ్డప్పుడు మా అమ్మ సినిమాలో అవకాశం వస్తే దాని ద్వారా లభించే ఆదాయం కుటుంబాన్ని నడిపించడానికి, నాన్నగారి మందులకు ఉపయోగపడతాయనుకున్నారు. అందుకు మా నాన్నగారు సమ్మతించారు. ఆ సమయంలో జెమినీ సంస్థ సినీరంగంలో ప్రముఖంగా ఉండేది. అప్పుడే చంద్రలేఖ అనే సినిమాను బ్రహ్మాండంగా రూపొందిస్తున్నారు. మా అమ్మ తన గాత్రశక్తిగురించీ మా కుటుంబ స్థితిగతుల గురించి వివరిస్తూ జెమినీవారికి ఓ ఉత్తరం రాశారు. అప్పుడు అమ్మకు కోరస్ గాయనిగా అవకాశం లభించింది.

చిన్నప్పటి నుంచే నాకూ పాటలంటే ఇష్టం. భగవంతుడి కృపతో అమ్మలాగే నాదీ మంచి గాత్రమే. స్కూల్లో ఏ కార్యక్రమమున్నా నన్ను పాడమనేవారు. స్కూలు వార్షికోత్సవం వంటివి నిర్వహించేటప్పుడు ఒక కార్యక్రమానికీ ఇంకొక కార్యక్రమానికీ మధ్య ఉండే కొద్దిపాటి సమయంలోనూ (గ్యాప్‌లో)

నాకొక మైక్ ఇచ్చి వేదికమీదకు ఎక్కించేవారు. ఓమారు, వైఎంసిఎలో ఓ పాటల పోటీ ఏర్పాటు చేసినప్పుడు ఓ మిత్రురాలు నువ్వు బాగా పాడుతావుగా, నువ్వూ ఈ పోటీలో పాల్గొనమని చెప్పింది. మొదటిరోజు కాస్తంత ఆలోచించినా ఆమె బలవంతం చేయడంవల్ల సరేనని ఒప్పుకున్నాను. కానీ పాటలపోటీలో పాల్గొనడానికి పావలా డబ్బు కట్టాలని తెలియడంతోనే ఆ మేరకు నాకు వీలు లేదని నన్నొదిలేయమని చెప్పేసాను. కానీ నా స్నేహితురాలు వదలలేదు. ఆ పావలా నేను కడతాను....నువ్వు తప్పకుండా పాటలపోటీలో పాల్గొనవలసిందే అని ప్రేమగా ఆదేశించింది. ఆమె పేరు భానుమతి. నేనూ ఆమె నా చెల్లి తిన్నగా వైఎంసిఎకి వెళ్ళాం. అక్కడకి అనేక పాఠశాలలనుంచి అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు వచ్చారు. వారినీ ప్రోత్సహించడానికి మరింతమంది వచ్చారు. నేనేమో లోలోపల వణుకుతున్నాను. కారణం అమ్మతో చెప్పకుండా ఇక్కడి వచ్చేసాం... ఇంటికి తిరిగెళ్ళడంతోనే అమ్మ ఏమంటుందోనని భయం. ఒక్కొక్కరినీ పిలుస్తున్నారు. వారు పిడి కింద దిగుతుంటే చప్పట్లే చప్పట్లు. నా పేరు పిలిచిన వెంటనే ఒకింత భయంతోనే వేదిక ఎక్కినా మైకు పట్టుకోగానే నా భయం పోయింది. నీ కేలనా... అనే కీర్తన పాడాను. పోటీ ముగిసింది. వైఎంసిఎ నుంచి బయలుదేరుతుంటే రాత్రి ఏడు దాటింది. నా స్నేహితురాలిని ఇంటికి తీసుకుపోవడానికి వచ్చిన ఆమె

# చక్కని నీతికథ

సైన్సు మాష్టారు తొమ్మిదో తరగతి పాఠం చెప్పిన తరువాత సమయం మిగలడంతో పిల్లల్తో మాట్లాడారు. "సృష్టిలో ప్రతి జీవికీ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తే, చిన్న ప్రాణుల నుండి కూడా నేర్చుకోడానికి మంచి లక్షణాలు కనిపిస్తాయి" అన్నారు.

నరేంద్ర అనే పిల్లవాడు "మాష్టారూ! నిజంగానా?"అన్నాడు సందేహంగా.

"సందేహమెందుకురా? రేపెలాగూ ఆదివారమే. ప్రయత్నించి చూస్తే మీకే తెలుస్తుంది" అన్నారు నవ్వుతూ మాష్టారు.

సోమవారంనాడు పాఠశాలలో తొమ్మిదో తరగతికి వచ్చినప్పుడు సైన్సు మాష్టారు నరేంద్రని నిలబెట్టి "నువ్వడిగిన ప్రశ్నకు జవాబు దొరికిందా?" అనడిగారు.

"ఇంటికి వెళ్ళగానే ఆ విషయం మరచిపోయాను" అన్నాడు తల ఒంచుకుని నరేంద్ర.

వాడి ప్రక్కనే కూర్చున్న కార్తీక్ చెయ్యెత్తాడు. వాడిని చెప్పమన్నారు మాష్టారు.

"మా ఇంట్లో పంచదార క్రింద పడింది. కాసేపటికి ఒక చీమ వచ్చి పంచదార పలుకుని తీసుకుపోయింది. మరికొంతసేపయ్యేసరికి చీమల దండు వచ్చింది అక్కడకి. ఒక్కో పలుకు చొప్పున దాదాపు మొత్తం పంచదారని తీసుకుపోయాయవి. వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు వరుస పాటించాయి చీమలు. అవెళ్లే దారిలో గిన్నె అడ్డుపెట్టాను. ప్రక్కనుండి వెళ్లిపోయాయి తప్ప ఆగలేదు చీమలు" అన్నాడు కార్తీక్.

"నీకేం అర్థమైంది?" అనడిగారు మాష్టారు.

పిల్లలంతా కార్తీక్ వైపు ఆసక్తిగా చూసారు.

"ఆహారం ఎక్కడుందో చీమలు త్వరగా గుర్తుపడతాయని, వరుస పద్ధతిని పాటిస్తాయని, దారిలో ఏదైనా అడ్డం వస్తే ఆగిపోవని, ఐకమత్యంగా ఉంటాయని తెలిసింద"న్నాడు వాడు.

"బాగా చెప్పావు" అని మెచ్చుకున్నారు మాష్టారు.

"ఇంకెవరైనా?" అని మాష్టారు అడగ్గానే రాము నిలబడి "మా దొడ్లో జామచెట్టు ఉంది. కాయలు కోద్దామని వెళ్లేసరికి ఒక సాలీడు గూడు అల్లుతూ కనిపించింది. గూడు కట్టే ప్రయత్నంలో అది జారి క్రిందపడిపోతుండేది. ఒకసారి పెద్దగా గాలి వీచింది. దాంతో దారం తెగిపోయింది. మరోసారి చిన్న కొమ్మ విరగడంతో దారం తెగి క్రిందపడింది. అలా ఆటంకాలు వచ్చినా పట్టు వదల్లేదది. చాలా సార్లు క్రిందపడినా ప్రయత్నం వదలకుండా ప్రయత్నించి చక్కని గూడు కట్టుకుని దర్జాగా అందులో ఇమిడిపోయింది సాలీడు" అన్నాడు.

"నీకేం అర్థమైందో చెప్పు?" అనడిగారు మాష్టారు.

"ఏదైనా పనిచేస్తున్నప్పుడు ఆటంకాలు వచ్చినా ఆగిపోకూడదని, ఎన్ని ప్రయత్నాలు చేసైనా సరే పని పూర్తి చెయ్యాలని" అన్నాడు రాము.

బాగా చెప్పావని రాముని మెచ్చుకున్నారు మాష్టారు.

ఈసారి మాష్టారు అడగక ముందే రవి నిలబడ్డాడు. 'నేనూ ఒకటి చెబుతా నంటూ' మొదలుపెట్టాడు.

"మా పెరట్లో పూలమొక్కలే కాకుండా జామ, దానిమ్మ , వేపచెట్లున్నాయి. వేపచెట్టు కొమ్మల్లో తేనెటీగలు తేనెపట్టుని పెట్టాయి. అక్కడ నుండి తేనెటీగలు వచ్చి పువ్వుల మీద వాలాయి. ఒక్కో పువ్వునుండి మకరందాన్ని నోటిలోకి తీసుకొని ఝుమ్మని ఎగురుతూ తేనెపట్టులో దాచేసి మళ్ళీ వచ్చేవి. ఇంకో పువ్వు మీద వాలేవి. అలా రోజంతా ఎగురుతూనే ఉన్నాయి. మకరందం తీసుకెళ్తూనే ఉన్నాయి" అన్నాడు.

"నీకేం అర్థమైందని" వాడిని అడిగారు మాష్టారు.

"తేనెటీగలకి బద్ధకం లేదని తెలిసింది. మనం కూడా రోజంతా కష్టపడి ఉత్సాహంగా పనిచేసినప్పుడే కలిగే ఫలితం తేనెలాగా తియ్యగా ఉంటుందని బోధపడింది" అన్నాడు రవి.

మాష్టారు "పిల్లలూ! నరేంద్ర అడగబట్టే కదా వీళ్ళ ముగ్గురూ తెలుసుకున్న విషయాలను మనతో చెప్పారు. దీన్ని బట్టి ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని తెలిసింది కదా. వాళ్ళ ముగ్గురూ చెప్పినట్టు మనుషులు కూడా 'చీమల్లా ఐకమత్యంగా ఉండాలి. కష్టపడి పని చెయ్యాలి. తలో దారిలో వెళ్లకుండా ఒకే మాట, ఒకే బాటన్నట్టు ఉండాలి. పనిలో అడ్డంకులు వచ్చినా వదిలేయకుండా మరో ప్రయత్నం చెయ్యాలని, పూర్తయ్యేవరకు సాలీడులా పట్టు విడువకూడదని తెలిసింది. తేనెటీగల విషయానికి వస్తే అవి కష్టపడి తేనె పట్టు పెట్టినా తేనెను త్రాగలేవు. మనుషులే వాడుకుంటారు. మనం కూడా ప్రక్కవారికి ఉపయోగపడే పనులు చేస్తుండాలని గ్రహించాలి. మీరు శ్రద్ధగా గమనిస్తే మిగతా జీవుల్లో కూడా మంచి లక్షణాలెన్నో కనిపిస్తాయి" అన్నారు.

పిల్లలంతా సంతోషంగా చప్పట్లు కొట్టి "అర్థమైంది మాస్టారు. మేము కూడా మాలో మంచి లక్షణాలు పెంచుకుంటాము" అన్నారు ఏకకంఠంతో.

---

తల్లి మమ్మల్ని బస్సు ఎక్కించారు. మామూలుగా అయితే స్కూలు నుంచి నాలుగున్నర కల్లా ఇంటికి చేరుకునే మేము ఆరోజు ఇంటికి చేరడానికి ఎనిమిదిన్నరయింది. మమ్మల్ని చూడటంతోనే అమ్మకు కోపం వచ్చింది.

ఎక్కడికెళ్ళావే... ఎందుకింత ఆలస్యం అని అడిగి నన్ను కొట్టడం ఆరంభించారు. నన్ను మాట్లాడనివ్వలేదు. అలా ఇలా కాదు. బాగా కొట్టింది. తిన్న దెబ్బలతో అలాగే పడుకుండిపోయాను.

నేను పాడిన మొదటి భక్తి పాట కున్నెక్కుడి సంగీతంలో ఉలగాలుం ఉమయవళే... మొత్తంమీద ఎన్ని భక్తి పాటలు పాడానో లెక్కలేదు.

జయలలిత (తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి)కి నేను పాడిన మొదటి పాట నీ ఎన్నదెన్న... నాన్ ఎన్నదెన్న... (వెన్నిర ఆడై సినిమా)

వేళాంగన్ని మాతా నా ఇష్టమైన దైవం.

ఇష్టమైన రాగం – షణ్ముఖప్రియ. వారాయ తోయి పాట ఆ రాగంలోనిదే.

చేపలతో చేసిన అన్ని రకాల వంటలూ ఇష్టమే

ఈ ఇంటర్వ్యూ దాదాపు పదకొండేళ్ళ క్రితం వెలువడింది.

1958 నుంచి 1980ల వరకు ఆరు భాషలలో ముప్పై వేలకు పైగా పాటలు పాడిన ఈవిడ 1958లో నల్ల ఇడత్తు సంబంధం అనే సినిమాకోసం ఇవరేతాన్ అవరు...అవరేతాన్ ఇవరు అనే పాటను మొదటిసారిగా పాడారు.


శివాజీగణేశన్ – సావిత్రి నటించిన పాసమలర్ సినిమాలో పాడిన పాటతో ఆవిడ పాపులర్ అయ్యారు. ఆకాలంలో సహగాయనీమణులతో పోటీ ఉన్న మాట నిజమే. కానీ మా మధ్య ఈర్ష్య ఉండేది కాదు. సంగీతదర్శకులలో కె.వి. మహదేవన్ అంటే ఓ మెట్టు ఎక్కువ ఇష్టం. ఇప్పుడు పాడుతున్న వాళ్ళందరూ తమ తమ ప్రతిభనం బాగానే నిరూపించుకుంటున్నారు. అయితే ఇప్పుడొచ్చే పాటలలో పాటల మాటల కన్నా వాయిద్యాల ఘోష ఎక్కువగా ఉందని ఓ అభిప్రాయం. అది నిజమే.


పాడుతున్నప్పుడు నేను అనుభూతితో పాడటంచూసి మీరు సినిమాలో నటించి ఉండొచ్చు అని అడిగేవారు. కానీ నేనెందుకు నటించాలి? నటిగా ఉండి ఉంటే వయస్సయిపోయిందని ఓ పక్కన పెట్టేసేవారు. ఓ మంచీ విషయమేమిటంటే నేనా తప్పు చేయలేదు.

చాలా రోజు తరువాత తర్వాత ఆవిడ మూక్కుత్తి అమ్మన్ అనే సినిమాలో ఓ భక్తి పాట పాడారు. మూక్కుత్తి అమ్మనుక్కు పొంగల్ వైప్పోం....వేప్పిలై ఏంది వందు వరం కేట్పోం....అనే ఈ భక్తిపాటను కవి పా. విజయ్ రాశారు. గిరీశ్ స్వరపరిచారు. మూక్కుత్తి అమ్మన్‌గా నయనతార నటించారు.

ఆర్.జె. బాలాజీ దర్శకత్వం వహించారు. 2020 నవంబర్ నెలలో ఈ సినిమా విడుదలైంది.

**– యామిజాల జగదీశ్**





# చీమలు - పండుటాకులు

అదొక కుగ్రామం. ఆ ఊరు పొలిమేరలో ఓ చెరువు. చెరువు గట్టు పక్కనే ఓ పెద్ద రావిచెట్టు. ఆ చెట్టు ఎండాకాలంలో ఆకుల్ని రాల్చడం, వానాకాలంలో ఆ చెట్టుకి ఆకుల్ని చిగురించడం అనేవి సహజసిద్ధంగా జరుగుతూ వస్తోంది.

ఆ చెట్టుకింద ఓ చీమల పుట్ట ఉంది. అందులో నించీ చీమలు ఆహారం కోసం చెరువు గట్టమ్మట తిరుగుతూండటం సర్వసాధారణమే.

అయితే చీమలు ఓరోజు రాలిన పండుటాకుల్ని చూసి హేళనగా నవ్వాయి. "మీవల్ల ఎవరికైనా ఆవగింజంత లాభముందా? నీటిమీదా చెట్టు మిమ్మల్ని వద్దనుకుని వదలుకుంటూ ఉంటాయి. మీరు రాలుతున్న చోటల్లా అందమే పోతుంది" అని ఈసడించాయి చీమలు. అక్కడితో ఊరుకోక మమ్మల్ని చూడు....ఎప్పుడూ చురుగ్గా ఉంటూ అటూ ఇటువంటి తిరుగుతుంటాం. ఆహారంకోసం అన్వేషిస్తూనే ఉంటాం. ఒక్కచోట కూర్చుని ఎవరో ఏదో ఇస్తారనుకుని సోమరిపోతుల్లా ఉండం. కష్టిస్తాం. తింటాం. ఒళ్ళు దాచుకోం అన్నాయి చీమలు.

చీమల మాటల్ని విన్న పండుటాకులు పల్లెత్తుమాటా అనలేదు. ఎప్పట్లాగానే నీటిలో తేలుతూ ఉన్నాయి.

ఆ రోజు సాయంత్రం హోరుగాలి వీచింది. చెరువు గట్టున తచ్చాడుతున్న చీమలు గాలికి తట్టుకోలేక నీటిలో పడిపోయాయి. నీటిలో ఆకలితో తిరుగుతున్న చేపలు చీమల్ని తినడానికి దాడి చేసాయి. అయితే చీమలు ఎలాగోలా చేపల నించీ తప్పించుకుని పండుటాకులమీదకు చేరి ఒడ్డుకు వచ్చేసాయి. అమ్మయ్య అనుకున్నాయి.

అప్పుడు పండుటాకులు "మేముగానీ నీళ్ళల్లో లేకుంటే మీరేమయ్యేవారో ఊహించండి. చేపలు మిమ్మల్ని తినేసేవి. ఇప్పుడర్థమైందా....దేవుడి సృష్టిలో ఏదీ వ్యర్థం కాదు. ఒక్కొక్కటీ ఒక్కొక్కప్పుడు ఉపయోగపడుతుంటాయి. ప్రతిదీ మేలు చేసేవే. కానీ ఆ మంచిని సద్వినియోగం చేసుకోవడం మన చేతుల్లో ఉంటుంది. ఈ సృష్టిలో ఒకదానికొకటి ఏదో రూపంలో ఉపయోగపడుతుంటాయి. వాటి మధ్య సంబంధ బాంధవ్యాలుంటాయి. కనుక ఏదీ తక్కువ కాదు. అలాగే ఎక్కువా కాదు" అని సున్నితంగా చెప్పాయి.

తప్పు తెలుసుకున్న చీమలు పండుటాకులకు కృతజ్ఞతలు చెప్పాయి.

కనుక పిల్లలూ! ప్రపంచంలో అన్నీ విలువైనవే. ఉన్నతమైనవే. ఒకటెక్కువా ఒకటి తక్కువా అని తేడాలు చూడకూడదు. ఇది అర్థం చేసుకుంటే చాలు. చిన్నచూపనేది చూడబోదు మనసు.

\- యామిజాల జగదీశ్






## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **28** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |


**ప్రముఖాంధ్ర**
**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**
**మొబైల్ : 98400 48941**

# వారణాసి ముక్తి భవనంలో 12000 మరణాలను చూసిన వ్యక్తి చెబుతున్న జీవిత సత్యాలు



*కాశీలో మరణిస్తే "మోక్షం" ప్రాప్తిస్తుంది అని హిందువులలో ఒక విశ్వాసం. అందుకోసం జీవిత అంత్యకాలం కాశీలో గడపడానికి వెళుతూ ఉంటారు.*

*అటువంటి వారికీ వసతిని కల్పించే ముఖ్యమైన మూడింటిలో కాశీలాభ్ ముక్తిభవన్ ఒకటి. మిగతా రెండూ ముముక్షు భవన్, గంగాలాభ్ భవన్.*

***1908**లో కాశీలాభ్ ముక్తి భవన్ స్థాపించబడింది. **44** సంవత్సరాల పాటు కాశీలాభ్ ముక్తి భవన్ మేనేజరుగా పనిచేసిన భైరవనాద్ శుక్లా ఆ భవనం ఎదుట ఎర్రని గోడల ముందు చెక్క కుర్చీలో కూర్చుని చెప్పిన విషయాలు ఇప్పుడు నేను మీ ముందు ఉంచబోతున్నాను.*


### 1. అంత్యకాలానికి ముందే క్రోధాన్ని విడనాడు (RESOLVE ALL CONFLICTS BEFORE YOU GO ) :

శ్రీరాంసాగర్ అనే ఒక సంస్కృత పండితుడు ఆరుగురు అన్నదమ్ములలో పెద్దవాడు. చిన్న తమ్ముడు అంటే ఇష్టం. కానీ కాలక్రమంలో ఇద్దరిమధ్య గొడవలు వచ్చి ఇంట్లో అడ్డుగా గోడ కట్టించే వరకూ వెళ్ళింది.

ఆయన తన అంత్యకాలంలో కాశీలాభ్ ముక్తి భవన్‌లో మూడవ నెంబరు రూమ్ బుక్ చేసుకున్నారు. తాను ఇంకొక పదహారు రోజులలో చనిపోతాను అని ఆయనకు ముందే తెలుసు. 3 రోజులు గడిచిపోయాయి. 4వ రోజున ఆయన తన తమ్ముడికి కబురు పెట్టాడు.

"40 ఏళ్ల క్రితం నా తమ్ముడితో గొడవపడిన విషయం నన్ను కలిచివేస్తోంది. నేను సుఖంగా మరణించలేను. "నాలో ఉన్న క్రోధం పోవాలి" అన్నాడు.

తమ్ముడు 16వ రోజు నాటికి వచ్చాడు. తమ్ముడిని చూడగానే అన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తమ్ముడి చెయ్యి తన చేతిలోకి తీసుకుని తమ్ముడి తల నిమురుతూ "ఆ గోడ పడగొట్టేయ్యి" అన్నాడు. అన్నదమ్ములిద్దరూ భోరున విలపించారు.



తమ్ముడి చేతిలో ప్రశాంతంగా ప్రాణాలు వదిలాడు అన్న.

భైరవనాద్ శుక్లా ఇలా అంటున్నారు "ఇటువంటి కథలు నేను ఎన్నో చూశాను. ఇక్కడకి వచ్చే వాళ్ళు బోల్డంత లగేజీతో వస్తారు. అందులో ఏదీ కూడా తీసుకు వెళ్ళలేరు.

'జీవితంలో ఘర్షణలు' లేకుండా ఎవరూ ఉండరు. కానీ వాటిని ఎంత తొందరగా పరిష్కరించుకుంటే అంత మంచిది. అంత సంతోషం పొందుతారు.

### 2. సాధారణంగా జీవించడం (SIMPLICITY IS THE TRUTH OF LIFE) :

చనిపోతాము అని తెలిసిన దగ్గరనుండి చెత్త తిండి తినడం మానేస్తారు చాలామంది. అప్పటికి కానీ చాలామందికి తాము సింపుల్ జీవితం గడిపి ఉండవలసింది అని అనిపించదు. సింపుల్ జీవితం అంటే తక్కువ ఖర్చుపెట్టడం. ఎక్కువ ఖర్చు పెట్టడం కోసం ఎక్కువ సంపాదించాలి అనుకోవడం. ఎక్కువ తాపత్రయపడటం కన్నా తక్కువలో సంతృప్తి పొందడం నేర్చుకుంటే ఆనందంగా జీవించవచ్చు అంటారు భైరవనాద్ శుక్లా.

### 3. ప్రజలలో ఉన్న చెడు లక్షణాలను మాత్రమే చూడకు (FILTER OUT PEOPLE'S BAD TRAITS) :

భైరవనాద్ శుక్లా ఇలా అంటారు "ప్రతీ మనిషిలోనూ మంచీ చెడూ రెండూ ఉంటాయి. మనం ఎదుటివ్యక్తిలోని చెడును మాత్రమే చూసి మంచిని పట్టించుకోము. వారిలోని మంచిని గుర్తిస్తే మనం వారితో స్నేహం మాత్రమే కాదు, వారిని ప్రేమించడం కూడా నేర్చుకోగలం.

### 4. ఇతరుల సహాయం పొందడం కూడా నేర్చుకో (BE WILLING TO SEEK HELP FROM OTHERS) :

మనం శక్తివంతులుగా తయారు కావడం మంచిదే కావచ్చు. ఎంత శక్తిమంతుడైనా అన్నీ తానే చేసుకోలేడు.

ఆ విషయంలో తాను ఇతరులకు సహాయపడడంతో పాటు ఇతరుల సహాయం అర్ధించే ధైర్యం కూడా ఉండాలి.

భైరవనాద్ శుక్లా 80 లలో జరిగిన ఒక సంఘటన గుర్తు చేసుకుంటున్నారు.

ఒక రోజు వర్షం కురుస్తూ ఉంటే కొందరు యువకులు ఒక ముసలామెను తీసుకుని వచ్చారు.

వాళ్ళు ఆమెను జాయిన్ చెయ్యడానికి కావలసిన దరఖాస్తు నింపకుండా వెళ్ళి పోయారు. తర్వాత పోలీసులు వచ్చారు. ఆమెను తీసుకుని వచ్చినవారు నక్సలైట్లు అని చెప్పారు పోలీసులు. మర్నాడు వాళ్ళు వచ్చినపుడు నేను అడిగాను "మీరు ఒకేసారి చాలా మందిని షూట్ చేసి చంపగలిగినపుడు ఆ ముసలామెను కూడా అలా చెయ్యొచ్చు కదా! మీరె ఆమెను సమాధి చెయ్యొచ్చు కదా! నేను అబద్ధం చెప్పే పరిస్థితి ఎందుకు కలిగించారు? అందులో ఉన్న ఆమె మనుమడు మోకాళ్ళపై కూలబడి అన్నాడు. మాలో ఎవరమూ ఆమె మోక్షం పొందే విధంగా ఆమెకు సహాయపడలేము. ఇక్కడ ఉంటే ఆమె తప్పక మోక్షం పొందుతుంది అందుకే ఇక్కడకు తీసుకువచ్చాము. మమ్మల్ని క్షమించండి.

**5. చిన్న చిన్న విషయాలలో అందం ఉంది (FIND BEAUTY IN SIMPLE THINGS) :**

మా ముక్తిభవన్ లో ప్రతీ రోజూ మూడు సమయాల్లోనూ భజనలు జరుగుతూ ఉంటాయి. కొందరు ఆ భజనలలో ఎంతో ఆనందంతో కీర్తనలు పాడతారు.

దారిన పోయే వారు కూడా ఆ ఆనందం పంచుకోవడం కోసం కొంత సేపు అక్కడ చేరుతారు. కానీ కొందరు అది తమ ఏకాంతానికి ఆటంకం అనుకొంటారు.

**6. సమస్యలనుండి పారిపోకు (ACCEPTANCE IS LIBERATION):**

కొందరు తాము ఉన్న స్థితిని అంగీకరించలేరు. ఇలా అంగీకరించలేక పోవడం వారిలో నిరాశ నిస్పృహలను కలిగించి ఒత్తిడి పెంచుతుంది.

నీవు ఉన్న స్థితిని నీవు అంగీకరిస్తే సమస్యల నుండి నీవు బయట పడడం నేర్చుకోగలవు. లేదంటే నీవు చీకటిలోనే ఉంటావు.

సమస్యను నీవు గుర్తిస్తే పరిష్కారం కోసం అన్వేషించగలవు, దానిని ఎదుర్కో గలవు. అపుడు నీవు శక్తి మంతుడవు అవుతావు.

**7. అందరి పట్ల సమభావంతో ఉండు (ACCEPTING EVERYONE AS THE SAME MAKES SERVICE EASIER) :**

ముక్తి భవన్లో చేరిన ప్రతీ ఒక్కరినీ ఒకే విధంగా కాకుండా వారి కులమూ, మతమూ, డబ్బూ, సాంఘిక, ఆర్థిక స్థితి గతులను బట్టి నేను చూడడం మొదలు పెడితే వారికీ నాకూ కూడా శాంతి ఉండేది కాదు.

ఎదుటి వ్యక్తులను సమభావంతో నీవు చూసిననాడు నీకు ప్రశాంతత ఉంటుంది. నీ పని నీవు చక్కగా చెయ్యగలుగుతావు .

**8. నీ లక్ష్యాన్ని నువ్వు గుర్తించు. సాధించే ప్రయత్నం చెయ్యి (IF WHEN YOU FIND YOUR PURPOSE, DO SOMETHING ABOUT IT) :**

నీ జీవిత లక్ష్యం ఏమిటి అనేది గుర్తించడం మంచిది. చాలా మందికి ఏమి చెయ్యాలో తెలుసు కానీ ఏమీ ప్రయత్నం చెయ్యకుండానే జరిగిపోవాలి అను కుంటారు.

**9. నీ మంచి అలవాట్లు విలువలుగా మారతాయి (HABITS BECOME VALUES) :**

మంచి అలవాట్లను చేసుకో! అది నీకు మంచి విలువలను నేర్పుతుంది. మంచి అలవాట్లను అభ్యాసం చేతనే నేర్చుకోవాలి.

సత్యమూ, దయా, సానుభూతీ, నిజాయతీ ఇవేవీ నీ ప్రయత్నం లేకుండా వాటంత అవి రావు.

**10. నీవేమి నేర్చుకోవాలో నీవే నిర్ణయించుకో (CHOOSE WHAT YOU WANT TO LEARN) :**

ఈ ప్రపంచంలో ఎంతో విజ్ఞానం ఉంది. అందులో నీవు ఏది కావాలి అను కుంటున్నావో దాన్ని ఎంచుకో! పెద్దవారి సూచనలు పరిగణనలోకి తీసుకో.

ఇక్కడకి వచ్చిన వారు ఆఖరు దశలో ఉంటారు. నడవలేరు, మాట్లాడలేరు. అపుడు వారిలోకి వారు వెళ్ళడం మొదలు పెడతారు.

వారి అనుభవాలలోనే వారు కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటారు. నేర్చుకున్న దానిని నెమరు వేసుకుంటూ ఉంటారు.

**11. నీవు ప్రజలతో సంబంధాలు తెంచుకోకపోతే, వారు రగిలించిన ఆలోచనలతో సంబంధం తెంచుకో (YOU DON'T BREAK TIES WITH PEOPLE; YOU BREAK TIES WITH THE THOUGHT THEY PRODUCE) :**

నీవు ప్రేమించిన వ్యక్తులు, నీకు ఆప్తులు అయిన వ్యక్తులు నీతో అన్ని విషయాలలోనూ ఏకీభవించకపోవచ్చు.

మీ మధ్య భేదాభిప్రాయం ఆలోచనలలోనే తప్ప వ్యక్తులతో కాదు.

నీవు నేర్చుకోవలసినది వారిపై ప్రతీకారభావం కాదు. వారి పట్ల కఠిన హృదయం కాదు.

**12. నీ సంపాదనలో పది శాతం దానం కోసం కేటాయించుకో (PERCENT OF WHAT YOU EARN SHOULD BE KEPT ASIDE FOR DHARMA) :**

ధర్మం అంటే మత సంబంధం కాదు. మంచిని చెయ్యడం. ఒక పది శాతం సంపాదన ఇందుకు కేటాయించుకో! చాలామంది జీవిత అంత్య కాలంలో దాన ధర్మాలు చేస్తూ ఉంటారు. వృద్ధాప్యం వలన వారికి కలుగుతున్న అసౌకర్యాలు ఇతరులకూ కలుగుతున్నాయని తెలుసుకుని అవి తొలగాలని కొంత సహాయ పడుతూ ఉంటారు. ఎవరైతే ఆప్యాయతను పొందుతూ ఉంటారో, అపరిచితుల ప్రేమను పొందుతారో, వారు ప్రశాంతంగా ప్రాణం విడువగలుగుతారు. నీవు సంపాదించినదంతా నీవే అనుభవించాలి అనుకోకు. కొంత ఇతరులకు మిగుల్చు.

ఇది ప్రతీ ఒక్కరూ చదవవలసిన పోస్ట్. ఒరిజినల్ ఇంగ్లీష్‌లో చాలా బావుంది.

– రాఘవానంద్ ముదుంబ


Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై




## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# అంత్యకాల స్మరణ

కన్నడ దేశమందలి ఒకానొక పట్టణమున పూర్వమొక ధనికుడు కాపురముండెను. అతడు ఆగర్భశ్రీమంతుడు. పెక్కు భవనములు, క్షేత్రములు అతనికి కలవు. తాను తనకుటుంబము నివసించుటకై ఒక నాలుగంతస్తుల మేడను ప్రత్యేకించి బహు సుందరముగ నిర్మించుకొనెను. అందు సకల భోగభాగ్యములను అనుభవించుచుం డెను. అతనికి ప్రాపంచిక సంపద విస్తరముగ నున్నదేకాని దైవసంపద కొంచెమైనను లేదు. భగవంతునిపై విశ్వాసమతనికి ఏమాత్రమును లేదు. భగవన్నామ ముచ్చరించు డని, పుణ్యకార్యము లాచరించుడని ఎవరెన్ని చెప్పినను అతడు లక్ష్యపెట్టక ప్రాపంచిక సంపదే తనను కడతేర్చునను నమ్మకము గలిగి భోగలాలసుడై, దైవవిముఖుడై కాలము గడుపుచుండెను.

కాలచక్రము వేగముగ పరిభ్రమించుచుండెను, కొంత కాలమున కతనికి వార్ధక్యము దాపురించెను. అంగములు క్రమముగ శైథిల్యము నొందజొచ్చెను. శరీరము శుష్కింపదొడగెను. ఇట్టి పరిస్థితిలో ఒకనాడతనికి తీవ్రమైన వ్యాధియు సంక్రమిం చెను. గొప్ప గొప్ప వైద్యులు వచ్చి చికిత్సచేయుచుండిరి. కాని వ్యాధి తగ్గుముఖము పట్టలేదు. రుగ్మత క్రమక్రమముగ అధికము కాజొచ్చెను. భిషగ్వర్యులు నిరాశను ప్రకటింప దొడగిరి. అత్తఱి ఆతని బంధువులు, ఆప్తులు అత్యవసర సమావేశము జరిపి భవనముయొక్క మూడవఅంతస్తులో పరుండియున్న ఆ రోగిని నెమ్మదిగ క్రిందకు దించి దొడ్డిలో గల పశువుల కొట్టమునందు బరుండ బెట్టిరి.

జీవితములో ఒక్క పుణ్యకార్యమైనను చేయనివాడును, ఒక్క పర్యాయమైనను భగవన్నామమును ఉచ్చరించని వాడును, పై పెచ్చు ఎన్నియో పాపకార్యములను చేసినవాడు నగు ఈతనికి సద్గతి లభించుటెట్లు? అని బంధువర్గము తలపోసి అందులకు మార్గము నన్వేషించుచుండిరి. పూజ్యులగు మహనీయులను, గొప్ప తపస్సంపన్నులను బ్రహ్మనిష్ఠులను, అనుభవజ్ఞులను ఈ విషయమై ప్రశ్నించిరి. "అయ్యా! మా బంధువర్గములో ఒకడు జీవితమం దేలాంటి పుణ్యకార్యమున్ను చేయలేదు, ఇపుడు వృద్ధుడై రోగగ్రస్తుడై, కాటికి కాళ్ళుజాచుకొని యున్నాడు. ఇట్టి పరిస్థితిలో అతడు తరించుటకు, సద్గతి నొందుటకు ఏదైన మార్గము కలదా?" అని వారు ఆ పెద్దలను అడిగిరి. వారందలు ఏకగ్రీవముగ ఒకే ప్రత్యుత్తరమునిచ్చిరి. "ఓ జిజ్ఞాసువులారా! బాల్యమందుగాని, యౌవనమందుగాని, వార్ధక్యమందుగాని, అవసానదశ యందుగాని, ఏ కాలమందైనను మనుజునకు శ్రేయము నొసంగునది దైవచింతనయే, భగవన్నామస్మరణయే" అని వారు తెలిపిరి.

ఆ వాక్యములను వినిన వెంటనే ధనికుని బంధువులందఱును రివ్వున పరుగెత్తి రోగియొక్క మంచముచుట్టు చేరి – బావగారు! మామగారు! నాన్నగారు! "నారాయణ" అనండి, "రామరామ" అనండి "కృష్ణ కృష్ణ" అనండి అని ఎన్ని పర్యాయములు బిగ్గరగా అరచినను, చెవిలో ఊదినను అతడు ఏమియు పలకలేదు. కండ్లు తెరచి ఎదుటనున్న వారిని మాత్రము చూచుచుండెను. అట్టి విపత్కర పరిస్థితి యందు బాంధవుల కేమిచేయుటకును తోచలేదు. "ఈతడు అభాగ్యుడు. కనీసము అంత్యకాల మందైనను దేవుని స్మరించు పుణ్యమునకు నోచుకొనలేదు. భగవన్నామ మును ఉచ్చరించలేదు. ఎట్టి ఘోరనరకమును జెందునో" అని బంధువర్గము పరితపించుచుండ్మ అకస్మాత్తుగ రోగియొక్క ముఖమునుండి ఏదియో శబ్దజాలము బయల్వెడలుచున్నట్లును, అతడేదియో ఉచ్చరించుచున్నట్లును వారు కనిపెట్టిరి.

తత్ క్షణము వారు చెవులు నిక్కపొడుచుకొని అతని నోటి సమీపమునకు బోయి అతడేమి పలుకుచున్నాడో వినజొచ్చిరి. "క, క, క" అను మూడు అక్షరములయొక్క శబ్దముమాత్రము వారు వినగల్గిరి. రోగి "క,క,క" అని మాత్రము పలికి ఊరకుండెను.

వెంటనే ప్రజ్ఞావంతులగు బంధువు లందఱును ఇట్లు యోచించి 'క, క, క' అను మూడక్షరములయొక్క అర్థమేమై యుండును? ఇది ఏదైనా భగవన్నామమా? లేక దేవత లాతనికి చివరి గడియలలో ఎద్దైనా ఇట్టి మంత్రమును ఉపదేశించినారా? లేక అవి ఏవైనా గొప్ప బీజాక్షరములై యుండునా? ఒకవేళ అయియున్నచో మనము కూడ అంత్యకాలములో ఈ ప్రకారముగ క, క, క అనినచో మనకుకూడ సద్గతి లభించునుగదా! కాబట్టి దీని అంతర్య మేమియో తెలిసికొనుట మంచిది. అయితే దానిని ఇతరు లెవరును చెప్పలేరు. ఉచ్చారణ చేసిన రోగియే చెప్పగలడు అని నిర్ణయించుకొని బంధువర్గ మంతయు అతని చెవియొద్ద చేరి ఐక్యకంఠముతో "నాన్నా గారు, బావగారూ! మీరు పలికిన "క, క, క" అను మంత్రముయొక్క అర్థమేమిటి? త్వరగా చెప్పండి" అని బిగ్గఅగా అరచిరి, కాని రోగి ప్రత్యుత్తర మీయలేదు, అందరు నిరాశా పరిపూరితులైరి.

కాని ధైర్యము వీడక వారందఱు తత్‌క్షణమే ఆ పట్టణములో గొప్ప ప్రాక్టీసు కలిగి పేరుమ్రోగినట్టి ఒక డాక్టరువద్దకు వెళ్ళి "మహాప్రభో! మహాశ్రీమంతుడైన మాబంధువొకడు చివరి ఘడియలలో ఏదియో బీజాక్షరములు పలికినాడు, బహుశా దేవతలు బోధించిన మంత్రమేమో అది. దాని అర్థము తెలిసికొనవలెనని మేమందరము కుతూహలాయత్త చిత్తులమై యున్నాము. అతడు నోరు తెరచి మాట్లాడుటలేదు. ఇంకను కొద్దిక్షణములు మాత్రమే అతనికి మిగిలియున్నది. తమరు దయచేసి ఏద్దైన పటుతరమైన, మహాశక్తివంతమైన ఇంజక్షన్ అతనికి ఇచ్చి కొంచెం మాట్లాడునట్లు చేసితిరా, మీ ఋణము మేము తప్పక తీర్చుకొన గలము," అని చెప్పిరి.

తోడనే డాక్టరు తన మందులపెట్టెను చంకనిదుకని స్టెతస్కోపును మెడలో ధరించి కారులో హుటాహుటి రోగియొద్దకు పయనమయ్యెను. రోగిని సమీపించి, నాడి పరీక్షించి ఇంకను స్పృహ ఉన్నారని పలికి సద్యఃఫలితము నొసంగు అద్భుత మగు ఇంజక్షన్ ఒకటి ఇచ్చెను. వెంటనే ఫలితము చేకూరినది. రోగి కదలజొచ్చెను, మాట్లాడ సాగెను.

ఇదియే అదను అని తలంచి బంధువు లందఱును ఆతని చుట్టుచేరి "నాన్న గారూ! మీరు పలికిన క, క, క అను మంత్రము యొక్క బాష్యం కొంచెం సెలవివ్వండి" అని ప్రార్థించిరి. వెంటనే అతడు "కరు కసబరికయన్ను కడియుత్తదే" అని తానుచ్చరించిన బీజాక్షరములయొక్క వివరణమును తెలియజేసెను. దాని అర్థమేమనగా దూడ చీపురుకట్ట తినివేస్తున్నది కాబట్టి దానిని తీసి జాగ్రత్త చేయండి అని అతడు కన్నడ దేశస్థుడు కాబట్టి కన్నడభాషలో చెప్పెను. పసువుల కొట్టములో అతనిని పరుండబెట్టినందున అతని దృష్టి చీపురుకట్ట కొరికి వేయుచున్న దూడపై ప్రసరించగా పై వాక్యము నుచ్చరించెను. అంత్యకాలమున అతనిని తాను సంపాదించిన ధనము వదలిపోవు చున్నది, సుందరభవనము వదలిపోవుచున్నది, భార్య, బిడ్డలు వదలిపోవు చున్నారు, సమస్త భోగభాగ్యములు, సంపదలు

# దక్షిణాయనం ప్రారంభం

ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు.

దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి.

సూర్య గమనాన్నిబట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు.

భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు.

ఏడాదిలో 6 నెలలు ఉత్తరాయణం.

6 నెలలు దక్షిణాయనం.

సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం.

కర్కాటక రాశిలోకి ప్రవేశించినప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది.

సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6 గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది.

ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి.

ఖగోళ శాస్త్రం ప్రకారం సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు.

'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది.

సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు.

కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు.

సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే.

అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు కాస్త ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది.

సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని 'ఉత్తరాయాణం' అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని 'దక్షిణాయనం' అని అంటారు.

ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు.

ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే , దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడానికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు , మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు.

శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపాసన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి.

ముఖ్యంగా దక్షిణాయనంలోనే పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన 'మహలయ పక్షాలు' వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే వారి అనుగ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించకపోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య.

## చేయవలసినవి

ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్నవారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యారాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగిపోతాయని పెద్దలు సూచించారు.

– సేకరణ, **పడమటింటి సత్యనారాయణ**






వదలిపోవుచున్నవి. ఇది యంతయు పోవుచున్నప్పుటికి ఒక్క చీపురుకట్ట పోవుచున్నదే అను దిగులు అతనికి పట్టినది! ఎంత హాస్యాస్పదమైన విషయము! ఎంత శోచనీయమైనదశ! తన్నుచ్చరించినవారిని కడతేర్చునట్టి సర్వేశ్వరుని విస్మరించి, పవిత్రమైన భగవన్నామమును స్మరింపక అంత్యకాలములో తుచ్ఛమైన ప్రపంచ వస్తువులనే తలంచుకొనుచు అందును హీనతరమైన ఒకానొక అల్పవస్తువును (చీపురును) భావించుచు ఆ ధనికుడు జీవితమును వ్యర్థపఱచుకొనెను.

"తస్మాత్సర్వేషుకాలేషు మామనుస్మరజా" అని భగవానుడు పలికినట్లు జీవిత మందెల్ల వేళలందును దైవస్మరణ చేయుచు పవిత్ర భావనలను గలిగియుండు వానికే అంత్యకాలమునగూడ అట్టి నిర్మలభావములు వచ్చుచుండును. కాబట్టి ప్రతివారును తమ జీవితమందలి ప్రతిఘడియకూడ మహామూల్యవంతమని గ్రహించి, భగవచ్చింతన యందును పరోపకారమందును, పుణ్యకార్యాచరణయందును దానిని వినియోగించుచు పవిత్రసంస్కారమును ఏర్పరచుకొనినచో అంత్య కాలమందును అట్టి ఉత్తమభావనలే జనింప భగవత్సాన్నిధ్యమును జేరి జీవితమును ధన్యమొనర్చు కొనగలరు.

**నీతి:–** జీవితకాలముంతయు దైవభావన గలిగియుండినచో అంత్య కాలమున అట్టి పవిత్రదైవభావమే కలిగియుండి తరింతుము

ఏష ధర్మః సనాతనః

# 14. సర్వ దేవాత్మకుడు ఆదిత్యుడు

పూజ్యగురువులు శ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారు.

## సర్వదేవాత్మకుడు ఆదిత్యుడు

- ప్రాతఃకాలాన్నే స్నానం చేసి, శుచిగా సూర్యుని నమస్కరిస్తే చాలు – పాప నిర్మూలనం జరిగి, పవిత్రులమవుతామని మహాభారతంలో శ్రీకృష్ణుడు బోధించాడు.
- సూర్యోదయ సమయంలోని రోగహరణ శక్తే – ఉష.
- సూర్యకిరణాల వలన కలిగే వికసనశక్తి చేతనే సర్వ జగతి చేతనత్వం పొందుతోంది. ఆ శక్తినే 'పద్మిని' అన్నారు. ప్రతిబింబశక్తిని 'ఛాయ' గా చెప్పారు.
- వీరే సూర్యుని భార్యలు.
- సౌమ్యత, తీక్షణత, ప్రశాంతం, ప్రచండం... అన్నీ సూర్యునిలోనే మనం చూడవచ్చు. ఘోరం, అఘోరం... ఈ రెండింటితోనూ ప్రపంచాన్ని ప్రభావితం చేసేవాడు ఈతడే కనుక రుద్రుడనీ, శివుడనీ, దిక్కులకు పతి అనీ వేదం పేర్కొంది.
- సూర్యుని నుంచే దిక్కులు ఏర్పడుతున్నాయి. సూర్యో దయ దిశను తూర్పుగా తెలుసుకున్నాకనే, మిగిలిన దిశలను నిర్ణయిస్తున్నాం.
- కనుక, 'దిశాంచ పతయే నమః' అని శ్రుతిమంత్రం వినుతించింది. ఆ కిరణాలే ఆయనకు సహస్రకరాలు.
- ఇవ్వడం, లాలించడం, పాలించడం, కర్మచేయడం చేతుల లక్షణం. సూర్య కిరణాలు ఈ నాలుగు పనులతో విశ్వానికి హితాన్నీ, రమ్యతనీ అందిస్తాయి. కనుక 'హిరణ్యబాహువు' అని కీర్తించారు. ఈ కిరణాలను ప్రపంచమంతా పరచి వాటి ద్వారా సకల చరాచరాలకు ప్రాణశక్తిని అందిస్తున్న వ్యాపకత్వం చేత ఈయననే 'విష్ణువు' అన్నారు.
- కిరణాలకున్న గమనలక్షణం బట్టి 'గరుత్మంతుడు' అని పేర్కొన్నారు. కిరణాలనధిష్ఠించిన ఆదిత్యుడు గరుడవాహనారూఢుడు.
- సూర్యుని చైతన్యశక్తే జగతికి ఐశ్వర్యాలను ప్రసాదిస్తోంది. అందుకే లక్ష్మిగా, పరాశక్తిగా, జగదంబగా సౌరశక్తిని ఆరాధిస్తున్నాం. (భాను మండల మధ్యస్థా... లలితా సహస్రనామాల్లోని ఒక నామం.) సూర్యకిరణాలు తీక్షణంగా ఉన్నా, సౌమ్యంగా ఉన్నా పరిణామంలో మనకు మంగళకరాలు. మంగళమే ఆయన స్వభావం. అందుకే 'శివుడు' (మంగళమయుడు) అని ఆయనను నుతించారు (ఆదిత్యంచ శివం విద్యాతే... శాస్త్రోక్తి).
- ప్రాణశక్తి ప్రదానంతో సృష్టిని నిర్వహిస్తాడు కనుక బ్రహ్మ. స్థితి, పోషణ కలిగించే శ్రీహరి. 'నారం' అంటే సర్వజీవసమూహం. వారికి శక్తినిచ్చే ఆశ్రయ శక్తి (ఆయనం) ఈతడే కనుక సూర్యనారాయణుడు.
- 'ఇంధ దీప్తౌ' 'ఇది ఐశ్వర్యే' – అనే సంస్కృత ధాతువుల ననుసరించి ప్రకాశ, ఐశ్వర్య లక్షణాలచేత సూర్యుని 'ఇంద్రుడు' అన్నారు.
- కిరణాల్లోని జిడ్డుశక్తి 'మిత్ర', పోషణశక్తి 'పూష', ఆర్ద్రత 'వరుణ'. ఇలా సర్వదేవతలు సౌరశక్తి విశేషాలే. అందుకే వేదం – 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి...' అనే మంత్రాన్ని సూర్యపరంగానే చెప్పింది.
- ఒకే సూర్యశక్తి పలువిధాలుగా జగతిని అనుగ్రహిస్తోంది.
- సూర్యుడు జడ ప్రకృతి కాదు, పూర్ణచైతన్యం. సకల జగన్నిర్వహణ చేసే పరబ్రహ్మ చైతన్యం సూర్యుని ద్వారా మనల్ని అనుగ్రహిస్తున్నది. కనుక సర్వ దేవమయుడు ఆదిత్యుడు. సర్వదేవతాత్మకుడైన సూర్యుని ప్రకాశ దాహక శక్తినే యజ్ఞాగ్నిగా రగిల్చి, సర్వదేవతలను ఆరాధించే యజ్ఞసంస్కృతి మనది.
- అఖండ తేజః స్వరూపుడైన ఆదిత్యుని మాఘ మాసం నుంచి మనం మరింత కాంతులతో గ్రహించనున్నాం.
- ఉత్తరాయణ పుణ్యవేళ, దైవీయమైన సూర్యకాంతులు మన ప్రాంతాలకు సముజ్జ్వలంగా లభిస్తాయి.
- ఈ కాంతిగమన పరిణామాన్నే 'రథం మారడం' గా చెప్పి, సప్తసంఖ్యా ప్రధానత చేత 'సప్తమి' తిథిని 'రథసప్తమి'గా సూర్యారాధనకు వినియోగించడం మన సంప్రదాయం.
- వారాలలో తొలి దినమైన ఆదివారం, తిథుల్లో సప్తమి – సూర్యారాధనకు ప్రశస్తం.
- సూర్యనమస్కారం – ఆరాధన వైజ్ఞానికంగా, ఆధ్యాత్మికంగా కూడా సాఫల్యమైన భవ్య సంస్కృతి.

చాటువు అనగానే వెంటనే మనకు స్ఫురించే పేరు శ్రీనాథుడు. ఆయన మహాకవి, సరసుడు. కాబట్టే తను చూసిన అనేక దృశ్యాలను చాటువుల్లో నిక్షిప్తం చేసాడు. వాటిలో వున్న చమత్కారం పాఠకులను తాదాత్మ్యం చెందించి చాటువులకు చిరస్థాయినీ, చిరకీర్తినీ కలిగించింది. కారెంపూడి (గుంటూరు జిల్లా) లో విడిది చేసినప్పుడు కారెంపూడి పట్టణమును కాశీతో పోల్చి చెప్పిన పద్యము.

**వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుడు కల్లిపోతురా**
**జారయ కాలబైరవుడు అంకమ శక్తి యె అన్నపూర్ణయున్**
**గేరెడి గంగధార మడుగే మణికర్ణిక గా జెలంగు నీ**
**కారెమపూడి పట్టణము కాశిగదా! పలనాటివారికిన్**

కాశీలో ప్రధాన దైవం విశ్వనాథుడు. శివుడు లింగాకారములో వుంటాడు. యిక్కడ నాథుడు వర్ణిస్తున్నది పల్నాటి యుద్ధం జరిగిన కారెంపూడి పట్టణాన్ని. ఆ యుద్ధంలో మరణించిన వీరుల స్మృతి చిహ్నాలుగా యిక్కడ వీరకల్లులు (లింగాకారములో వున్నరాళ్ళు) వుంటాయి. వీటినే దివ్య లింగాలు అంటున్నాడు. కారెంపూడిలో బ్రహ్మనాయుడు నిర్మించినట్లు చెప్పే చెన్నకేశస్వామి గుడి వున్నది. ఈ చేన్నుడే విష్ణువట. పల్నాటి యుద్ధములో ఉపయోగించిన ఆయుధాలు ఈ ఊళ్లోనే 'వీరులగుడి' లోనే వున్నాయి. జానపద వీరుడు పోతురాజును కాశీ క్షేత్ర పాలకుడైన కాలభైరవుడితో పోలుస్తున్నాడు. ఇక గ్రామదేవత అంకాలమ్మయే అన్నపూర్ణ అనుకోమంటున్నాడు, ఇక్కడున్న గంగధార మడుగును మణికర్ణికగా భావించి కారెంపూడి పట్టణాన్ని పల్నాటివాసులు కాశీ నగరంగా భావిస్తారని చమత్కరించాడు. కవిసార్వభౌముడు. మణికర్ణిక ఘట్టం కాశీలో మరణించిన వారి అంతిమ సంస్కారాలకు ప్రసిద్ధి. కారెంపూడిలో ఇనుపయుగపు (Iron age) సమాధులు వున్నాయి.

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**



# కనువిప్పు కలిగించే యదార్ధ గాథ

**'ఓమ్ భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి – ధియో యోనః ప్రచోదయాత్'**

అని తాతగారి గదిలోంచి వినిపిస్తున్న 'గాయత్రీ మంత్రా'న్ని విని వినోద్, వనజా నవ్వుకున్నారు.

"తాతగారికి ! చాదస్తం ఎక్కువలా ఉంది... ఇలా రోజూ మూడువేళలా మూడు గంటల సమయం వృధా చేసుకుంటున్నారు. దీని బదులు వాకింగ్ కానీ, మరేదైనా ఎక్సర్ సైజ్ చేస్తే మేలు కదా!" అన్నాడు వినోద్. వంటగదిలోంచి వీరి మాటలు వింటున్న బామ్మ భవాని "ఏరా! తాతగారిని విమర్శించేంత గొప్పవారా మీరు! మీకేం తెల్సురా 'గాయత్రీ' మాత ప్రభావం?" అంది కోపంగా.

"ఏంటర్రా! పిల్లలూ! మీ బామ్మ ఏదో చెప్తున్నట్లుంది ? ఏదైనా కథా?" అని అడిగాడు తాత తారకరామయ్య.

"వీరికి కాస్త గాయత్రి గురించి చెప్పండి. 'గాయత్రీ మాత' మహత్వం తెలీక ఏదో అనుకుంటున్నారు. పైకి అనలేదు కానీ వీరి మనస్సుల్లో 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?' అనే సందేహం మాత్రం ఉంది" అంటూ బామ్మ వంట గదిలోకి వెళ్ళింది.

తారకరామయ్య తన వాలు కుర్చీలో కూర్చున్నాక, పిల్లలిద్దరూ వెళ్ళి ఆయన కిరువైపులా స్టూల్స్ లాక్కుని కూర్చుని "తాతగారూ చెప్పరూ! ప్లీజ్!" అని అడిగారు.

ఆయన గొంతు సవరించుకుని చెప్పసాగారు. "ఇది నిజంగా జరిగిన సంఘటన, కల్పనా కాదు, ఎవరో రాసిన కథా కాదు. యదార్ధగాథ. అది ఆంగ్లేయులు మన దేశంలో ఉన్నప్పటి విషయం, అప్పటి ఒక ఆంగ్ల దొర 'థామస్ మన్రో' అనే ఆయన పేరని గుర్తు. క్యాంప్ మీద కన్నడదేశానికి వచ్చి, ఒక రోజున తన గుఱ్ఱం మీద తుంగభద్రా నది ఒడ్డున షికారుకు బయల్దేరాడు. ఆయన తోటి సుమారుగా అరడజను మంది జవాన్లు గుఱ్ఱంతో పాటుగా పక్కనే పరుగెడుతూ అనుసరించ సాగారు.

"మన గురించీ ఏమనుకుంటున్నారు జనం?" థామస్ తన వెంట ఉన్న వారిని అడిగాడు.

"చాలా మంచివారనుకుంటున్నారు దొరా!" వారిలో ఒక ముఖ్య సేవకుడు, బాపన్న చెప్పాడు.



"మీరంటే అందరికీ భయమే దొరా!" ముఖప్రీతికై మరో జవాన్ చెప్పాడు.

"సరి, సరి. ఈ రోజు విశేషాలేంటి?" థామస్ మళ్ళీ అడిగాడు.

"ఏమున్నాయ్ దొరా! మీరీ సమయంలో షికారుకు వస్తున్నారు కదా ఈ వారంగా ఒక్కపిట్టా ఈ దారంట రాదు."

"ఓహ్! అక్క డ చాలామంది జనం ఉన్నారు? ఏంటి విశేషం!" ఆశ్చర్యంగా అడిగాడు థామస్.

"దొరా! అక్కడ నది ఒడ్డున 'శృంగేరి పీఠాధిపతులు' కొలువు చేసి ఉన్నారు, ఆయన శిష్యులూ, స్వామి వారి ప్రవచనం ఆలకించను ఊరి జనమూ చేరి ఉన్నారు దొరా!"

"శృంగేరీ పీఠమా! అదేంటీ ఎన్నడూ వినలేదే?"

"దొరా ! మీరిక్కడికి ఎప్పుడూ రాలేదు కదా! అంచేత విని ఉండరు. ఈ కన్నడదేశంలోని, చిక్క మగళూరు దగ్గరే శృంగేరి ఉంది. ఆది శంకరాచార్యులు ధర్మ ప్రచారం కోసం మొదటి మఠాన్ని ఇక్కడ శృంగేరీలో స్థాపించారు."

"శృంగేరి అంటే అర్ధమేంటి? దానికా పేరు మఠస్థాపన తర్వాత వచ్చిందా? లేక ముందు నుంచే ఉందా?"

"శృంగేరి తుంగభద్ర నది ఒడ్డున ఉన్నది దొరా!. తుంగభద్ర నది ఇటు ప్రక్కన విద్యాశంకర దేవాలయం, తుంగభద్ర నది అవతల ఒడ్డున నరసింహవనం ఉన్నాయి. శృంగేరి అనే పేరు 'ఋష్యశృంగగిరి' నుండి వచ్చిందని అంటారు దొరా! శృంగేరికి సమీపంలో 'శృంగపర్వతం' ఉన్నది. విభండక మహర్షి కుమారుడు 'ఋష్యశృంగ' మహర్షి. ఈ యోగి మహానుభావుడు ఒకసారి 'రోమపాదు' డనే రాజు పాలిస్తున్న 'అంగ రాజ్యం' క్షామానికి గురై, జనం బాధపడసాగారుట. ఆ సమయంలో, ఋష్యశృంగుడు అడుగుపెట్టగానే వర్షాలు పడి, క్షామ నివారణ ఐనదని అంటారు. ఈ గ్రామములో శంకరాచార్యులు అద్వైతాన్ని వ్యాప్తి చేయ టానికై స్థాపించినదే ఈ శృంగేరీ శంకరమఠం."

"ఎంతైనా మీ భారతదేశం చాలా గొప్పదోయ్ ! మహానుభావులు ఎంతోమంది ధర్మస్థాపనకై కృషి చేసిన 'పుణ్యభూమి' మీది. నాకెంతో ఇష్టం మీ దేశమంటే,

నేనిక్కడ పుట్టకపోతినే అని బాధపడుతుంటాను అప్పుడప్పుడూ." థామస్ మనస్ఫూర్తిగా అన్నాడు.

"ఔ దొరా! మాదేశం మహా గొప్పది!" మురిసిపోతూ తన దేశాన్ని గురించీ చెప్పుకున్నాడు మరో జవాన్ రొపప్రత్రూ వెంట నడుస్తూ.

"శంకరాచార్యుల వారు మఠాన్ని ఇక్కడే ఎందుకు స్థాపించాలనుకున్నారో తెల్సా?" థామస్ అడిగాడు.

"శంకరాచార్యుల వారు, తన పరివార శిష్యులతో ధర్మ ప్రచారం కోసం దేశాటన జరుపుతూ ఇక్కడ పర్యటిస్తూన్నప్పుడు, ఆయన ఒక చిత్రం చూశారు దొరా! ఒక సర్పం ప్రసవిస్తున్న ఒక కప్పకు ఎండ పడకుండా తన పడగ నీడ పడుతున్న దృశ్యం, ఆయన చూసి ఆశ్చర్యపడ్డారు, ఈ స్థల మహత్యం గొప్పదని గమనించారు. అంతే కాక ఇక్కడ వరకు వచ్చేసరికి మండన మిశ్రుడి భార్య ఐన ఉదయ భారతి సరస్వతి మూర్తిగా మారిపోతుంది. ఆ కథ చాలాపెద్దది ఇంకోమారు చెప్తాను దొరా! ఈ రెండు సంఘటనలు చూసిన ఆయన ఇక్కడే మెదటి మఠం నిర్మించాలని తలచి మఠాన్ని స్థాపిస్తారు. ఆది శంకరుడు ఇక్కడ 12 సంవత్సరాలు గడిపారని చెప్తారు. అంత గొప్ప పుణ్యక్షేత్రం ఈ శృంగేరి."

"మరి ఆ మహాపురుషుడేనా ఈయన?"

"కాదు దొరా అది జరిగి చాలా ఏళ్ళైంది. ఈయన ఆ గురు పరంపరలోనివారే! వీరంతా బాల్యంలోనే పీఠాన్ని చేరి వేద వేదాంగాలూ, శంకరాచార్యుల వారు ప్రవచించిన విశేషాలన్నీ అధ్యయనం చేస్తారు దొరా! వీరంతా బ్రహ్మచారులు, ఎవ్వరూ వారిని ముట్టుకోడం కాదుగదా! దరిదాపులకు వెళ్ళనే ఝుడుస్తారు, స్త్రీలైతే బహు దూరం నుంచీ దర్శించవలసినదే! వారు అనుగ్రహ భాషణంలోని ఆధ్యాత్మిక విషయాలు చాలా గొప్పవి దొరా! ఒక్కటి ఆచరిస్తే చాలు జన్మ సార్థకమవుతుంది." దూరంనుంచీ ఆ ఆచార్యులను గమనించిన థామస్ "ఆహా! ఆ ముఖ వర్చస్సెంత గొప్పగా ఉంది! వెయ్యి వాల్టుల బల్బు వెలుగుతున్నట్లుంది వారి తేజస్సు! మరి బాపన్నా! ఆచార్యుల చెంతగా ఉన్న ఆ స్త్రీ మూర్తి ఎవరు? స్త్రీలకు ప్రవేశమే లేదన్నట్లు చెప్పావు ? మరి వారికి అంత దగ్గరగా ఉన్న ఆ అందమైన, అద్భుతమూర్తి, టీనేజ్ గాళ్ ! ఎవరు బాపన్నా! వెళ్ళి తెల్సుకుని వస్తావా? ఈజ్ షీ హిజ్ సిస్టర్!"

"దొరా! మాకక్కడ ఎవ్వరూ స్త్రీమూర్తి కనిపించడం లేదే! మీకెవరు కనిపిస్తున్నారు?"

"అదో బాపన్నా! అంత బాగా కనిపిస్తుంటే లేదంటావేం? వెళ్ళి అడిగిరాపో?" అన్నాడు థామస్ దొర.

దొర ఆదేశం మేరకు బాపన్న చేతులు కట్టుకుని దగ్గరగా వెళ్ళి వినయంగా, ఆచార్య శిష్యులకు తమ దొర సందేహం విన్నవించాడు.

ఆ శిష్యుడు ఆశ్చర్యంగా "అక్కడ మాకెవ్వరూ స్త్రీమూర్తి కనిపించడం లేదే! అసలిక్కడ స్త్రీలకు ప్రవేశమేలేదే?" అన్నాడు.

బాపన్న "ఔ స్వామీ! మాకూ కనిపించడంలేదు. కానీ మా దొరకు కనిపిస్తున్న దిట! అడిగి వివరం తెల్సుకు రమ్మన్నారు. పీఠాధిపతులకు విన్నవించండి"అన్నాడు.

ఆ శిష్యుడు పీఠాధిపతులను సమీపించి , ఆ దొరగారి సందేహాన్ని చెప్పగానే, ఆశ్చర్యంగా ఆయన తలెత్తి దూరంగా గుట్టం దిగి తననే దీక్షగా చూస్తున్న ఆ దొరను చూసి, "నాయనా! నా సమీపంలో ఉన్నది శారదా మాత! ఆ తల్లి దర్శనం ఎవరికో నిష్టగా గాయత్రి చేసే వారికి కానీ లభించదు. నేను ఇక్కడ ప్రవచిస్తున్నప్పు డంతా ఆ మాత నా సమీపంలో ఉండి సద్వాక్కులను నా నోట పలికిస్తుంటుంది. నాశిష్యులైన మీరే కాంచలేని 'అమ్మ'ను ఆ దొర దర్శించాడంటే ఆయన పూర్వజన్మలో భారతదేశంలో జన్మించి, గాయత్రీ జపం సంపూర్ణంగా, నిష్టగా గావించి ఏదో ఒక కారణాంతరంవల్ల ఆంగ్లేయుడై , ఆ ప్రాచ్యదేశంలో జన్మించాడు. నేను పీఠాధిపతిని కనుక ఆయనకు నమస్కరించరాదు. లేనిచో ఆయన నమస్కార అర్హుడని వెళ్ళి చెప్పిరా!" అని శృంగేరీ పీఠాధిపతి చెప్పిపంపారు.'

"అదిరా గాయత్రీ మంత్ర మహత్యం అర్థమైందనుకుంటా ! నియమంగా భక్తితో జపించిన వారికి ఈ జన్మలోనే కాక మరు జన్మలోనూ రక్షణ నందిస్తుంది." అని తాతగారు వివరంగా చెప్పారు.

పిల్లలిద్దరూ "మన్నించండి తాతగారూ!! మాకివన్నీతెలీక తేలిగ్గా మాట్లాడాము. మాకూ 'గాయత్రి' ఉపదేశించండి... ఈ వేసవిలో ఇక్కడ ఉన్నన్నాళ్ళూ మీతో పాటు రోజూ గాయత్రి చేస్తాము. మా ఊరువెళ్ళాక వీలున్నంత సేపు నిత్య గాయత్రీ చేసేందుకు ప్రయత్నిస్తాము" అన్నారు. ●

# పెద్దల ఆశీర్వాద విలువ

మీరు ఏదో ఒక పెద్ద పని కోసం బయటకు పోయినప్పుడల్లా పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి అని అంటారు.

ఎందుకంటే మనకు వారి ఆశీర్వాదం లభిస్తే ఆ పని విజయవంతమవు తుంది.

చాలా మంది ఇది అబద్ధం అనుకుంటారు. మరియు ఇదంతా పనికిరాని పని అని వారు భావిస్తారు.

మనం కూడా వారిలో ఒకరం. అందుకే, ఈ రోజు మనం పెద్దల ఆశీర్వాదం ఎంత ప్రయోజనకరంగా మరియు ఫలవంతమైనదో తెలియజేసే కథను తెలుసుకుందాం...

పూర్వం సదాచార వేద పండితుడు ఉండేవారు. సరస్వతి కటాక్షమే కానీ లక్ష్మీ కటాక్షం లేనివాడు. అతనికి ఒక్కడే కుమారుడు. పండితుడికి వాక్శుద్ధి కలవాడిగా పేరొందినవాడు.

అవసాన దశలో కొడుకుని పిలిచి, "నాయనా! నేను నీకంటూ ఏ ఆస్తి పాస్తులు కూడపెట్టలేదు. కానీ నేను ఇంతవరకు నా జీవిత పర్యంతం ఆర్జించింది ఒక్కటే.

జీవితాంతం నా పని యెడల ఎల్లప్పుడూ నిజాయితీగా, ప్రామాణికంగా ఉన్నానని నీకు నమ్మకం ఇవ్వగలను కాబట్టి, నీకు ఆశీర్వాదం ఇస్తున్నాను, నీవు జీవితంలో ఎల్లప్పుడూ సంతోషంగా, విజయవంతంగా ఉంటావు. నువ్వు ఏది పట్టినా అది బంగారం అవుతుంది నాయనా! అని చెప్పి ప్రాణాలు వదిలాడు.

తండ్రికి చేయవలసిన ఖర్మలన్నీ చేశాడు. చేతిలో చిల్లి గవ్వ లేదు. విచారంతో సముద్ర తీరం చేరి ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఊరికే కూర్చోక చేతితో దోసిలి నిండా ఇసుకను తీసుకొని క్రిందకు పోస్తున్నాడు. ఒకసారి పోసాడు. రెండో సారి పోసేటప్పుడు తండ్రి ఆశీర్వాదము గుర్తుకొచ్చింది.

"పట్టిందల్లా బంగారం అవుతుంది" ఈ ఇసుక బంగారం అయితే ఎంత బాగుంటుంది అని ఇసుకను క్రిందికి పోసి చూసాడు.

మూడో సారి ఇసుకను చేతిలోనికి తీసుకొని తలపైకెత్తితే చుట్టూ సైనికులు తమ ఆయుధాలు గురి పెట్టి నిల్చొని వున్నారు. ప్రక్కన రాజు గారు వున్నారు.

ఆయన తీవ్రంగా "ఏం చేస్తున్నావు, ఏం వెతుకుతున్నావ"ని అడిగారు.

దానికి తండ్రి మరణం, తన దుస్థితి వివరించాడు.

అప్పుడు సైనికులు దూరంగా తొలగారు.

రాజు గారు అన్నారు, "మా నాన్న గారు కూడా ఇలానే ఆశీర్వదించి నాకు బహుమతిగా ఒక ఉంగరం ఇచ్చారు. అది రెండు రోజుల క్రితం ఇక్కడే ఎక్కడో పడిపోయింది. రెండు రోజులుగా వెతుకుతున్నాం. నీవు అవిషయం తెలుసుకొని వెతుకుతున్నావని మా సైనికులు అనుకొన్నారు" అని చెప్పగానే చేతిలోని ఇసుక చటాలని క్రిందికి వదిలి లేచాడు.

తండ్రి వాక్బలం.ఆ ఇసుకలోనే రాజుగారి ఉంగరం దొరికినది. రాజుగారి సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. వెంటనే మూడు సంచుల బంగారు నాణాలు కానుకగా ఇచ్చారు.

దానితో బంగారు నగల వ్యాపారం ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి ఆ రాజ్యంలోని గొప్ప వ్యాపారస్తుల జాబితాలోకి చేరిపోయాడు.

తల్లిదండ్రుల ఆశీస్సులకు అపారమైన శక్తి ఉందని, వారి ఆశీస్సుల కంటే గొప్ప సంపద మరొకటి లేదన్నది వాస్తవం.

సారాంశం

మన పెద్దలను గౌరవించడమే భగవంతునికి మనం చేసే ఉత్తమమైన సేవ. మాతృదేవోభవ..! పితృదేవోభవ...!!

రేపటి తరానికి బతుకు, భద్రతలతోపాటు భారతీయత కూడా నేర్పండి.

# తెలుగు కవితకు నారు వేసి నీరు పోసిన సాహితీ కోవిదులు

**1. నన్నయ్య భట్టు:** 11వ శతాబ్దం కవి. ఇతడు ఆంధ్ర మహాభారతమున ఆది సభాపర్వములు, అరణ్య పర్వములో కొంత భాగం రచించెను. ఆదికవి యని ప్రసిద్ధిగాంచెను. 'ఆంధ్రశబ్ద చింతామణి', అను వ్యాకరణ గ్రంథమును రచించి 'శబ్దశాసనుడు' అను బిరుదము పొందెను. రాజమండ్రి నివాసి.

**2. తిక్కన సోమయాజి:** ఇతని కాలం 13వ శతాబ్దం. మహాభారతమున విరాటపర్వతం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వములు రచించెను. కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడని వీరి బిరుదములు. ఇతడు నెల్లూరును పాలించిన మనుమసిద్ధిరాజు ఆస్థానకవి.

**3. ఎఱ్ఱాప్రగ్గడ:** ఇతని కాలం 14వ శతాబ్దం. నన్నయ పూర్తిచేయక వదిలిన అరణ్యపర్వమును పూర్తిచేసెను. ఇతర గ్రంథములు హరివంశము, నృసింహ పురాణము, శంభుదాసుడు రచించెను. ప్రబంధ పరమేశ్వరుడు బిరుదుగనెను. రెడ్డిరాజుల ఆస్థాన కవి. ఆంధ్ర మహాభారతమును రచించిన ఈ ముగ్గురు కవులకు కవిత్రయమని పేరు.

**4. పాల్కురికి సోమన:** కాలం 12-13 శతాబ్దములు. ఇతడు వీరశైవ మతమును ప్రచారము చేసెను. కర్ణాటక దేశీయుడు. బసవ పురాణము, పండిరాధ్య చరిత్ర అను ద్విపద కావ్యములను రచించెను.

**5. భాస్కరుడు:** ఇతని కాలం 12-13 శతాబ్దములు. ఇతడు వ్రాసినదే భాస్కర రామాయణము. ఈ గ్రంథము శిథిలము కాగా మల్లిఖార్జునభట్టు, అయ్యలార్యుడు, కుమారరుద్రదేవుడు పూరించిరి.

**6. గోనబుద్ధారెడ్డి:** ఇతని కాలం 13వ శతాబ్దం. రామాయణమును ద్విపదలో రచించినవాడు. ఇదియే రంగనాథ రామాయణము.

**7. శ్రీనాథుడు:** ఇతని కాలం 14-15 శతాబ్దములు. రెడ్డిరాజుల ఆస్థాన కవి. బహుగ్రంథకర్త. శృంగారనైషధము, కాశీఖండము, భీమఖండము, హరవిలాసము, శివరాత్రి మహాత్మ్యము, మరుత్తరాట్చరిత్ర మున్నగు గ్రంథములను రచించెను. 'కవి సార్వభౌముడు' అను బిరుదు పొందెను. అనేక దేశములు తిరిగి రాజులను దర్శించి కనకాభిషేకాది సత్కారములను పొందెను.

**8. బమ్మెరపోతన :** 14-15 శతాబ్దములలో జీవించెను. ఆంధ్ర మహాభాగవతము, వీరభద్ర విజయం, భోగినీ దండకము అను గ్రంథములను రచించెను. సహజ పండితుడు అను బిరుదము కలదు.

**9. శ్రీకృష్ణదేవరాయలు:** ఇతడు 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యము నేలిన చక్రవర్తి. సంస్కృతాంధ్రములందు పండితుడై అష్టదిగ్గజ కవులను పోషించి 'ఆంధ్రభోజుడు' అను బిరుదు పొందెను. ఆముక్తమాల్యద అను ప్రబంధము రచించెను.

## కృష్ణదేవరాయల కొలువులోని మహా కవులు

**1. అల్లసాని పెద్దన :** 'మనుచరిత్ర' అను ప్రబంధమును రచించెను. రాయలకు అంకితంచేసి సత్కారం పొందెను. ఆంధ్ర కవితా పితామహుడను బిరుదు కలదు.

**2 నందితిమ్మన :** ఈయనను ముక్కు తిమ్మన అని కూడా అందురు. 'పారి జాతాపహరణము' అను గ్రంథమును **రచించెను.**

**3. మాదయగారి మల్లన:** ఇతడు 'రాజశేఖర చరిత్ర' అను గ్రంథమును రచించెను.

**4. ధూర్జటి :** శ్రీకాళహస్తి మహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకములను రచించెను.

**5. అయ్యలరాజ రామభద్రుడు:** ఇతడు రామాభ్యుదయమును రచించెను.

**6.పింగళి సూరన :** ఇతడు రాఘవ పాండవీయము అనుద్వర్థి (శ్లేష) కావ్య మును, కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము అను గ్రంథములను రచించెను.

**7. రామరాజభూషణుడు:** భట్టుమూర్తి ఇతని నామాంతరము. వసుచరిత్ర అను శ్లేష కావ్యమును హరిశ్చంద్రోపాఖ్యానము అను ద్వర్థి కావ్యమును రచించెను.

**8. తెనాలి రామకృష్ణుడు:** ఇతడు వికటకవి. పాండురంగ మహాత్మ్యమను కావ్యమును రచించెను.

## కొందరు ప్రాచీన కవులు - గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. వేములవాడ భీమకవి | - | కవిజనాశ్రయం |
| 2. మారన | - | మార్కండేయ పురాణం |
| 3. కేతన | - | దశకుమార చరిత్ర |
| 4. మంచన | - | కేయూరబాహు చరిత్ర |
| 5. బద్దెన | - | సుమతీ శతకము |
| 6. నాచన సోమన | - | ఉత్తర హరివంశము |
| 7. జక్కన | - | విక్రమార్క చరిత్ర |
| 8. అనంతామాత్యుడు | - | 1. భోజరాజీయము 2. అనంతుని ఛందము |
| 9. దగ్గుపల్లి దుగ్గన | - | నాసికేతోపాఖ్యానం |
| 10. పిల్లలమర్రి పిన వీరభద్రుడు | - | 'వాణి నా రాణి' అన్న కవి రచనలు : 1. శృంగార శాకుంతలం, 2. జైమినీ భారతం |
| 11. దూబగుంట రామాయణకవి | - | పంచతంత్రము |
| 12. కొరవి గోపరాజు | - | సింహాసనద్వాత్రింశిత |
| 13. తిరుపతి వేంకటకవులు | - | పాండవోద్యోగ విజయములు, దేవీ భాగవతం – వీరి రచనలు. అవధాన విద్యకు ఆద్యులు. |
| 14. నందిమల్లయ, ఘంటసింగన | - | తిరుపతి కవుల వలె జంట కవులు ప్రబోధ చంద్రోదయం, వరాహ పురాణం, గ్రంధ రచన చేసిరి. |
| 15. చేమకూర వేంకటకవి | - | విజయ విలాసము |
| 16. సురవరం ప్రతాపరెడ్డి | - | ఆంధ్రుల సాంఘిక చరిత్ర |
| 17. చిలకమర్తి లక్ష్మీనరసింహం | - | గయోపాఖ్యానం |
| 18. దువ్వూరి రామిరెడ్డి | - | పానశాల |
| 19. రాజశేఖర శతావధాని | - | రాణాప్రతాపసింహ చరిత్ర |
| 20. తుమ్మల సీతారామ చౌదరి | - | రాష్ట్రగానం, బాపూజీ ఆత్మకథ వీరి రచనలు. వీరు తెలుగులెంకగా ప్రసిద్ధులు |
| 21. ఆరుద్ర | - | సమగ్ర ఆంధ్ర సాహిత్యం. సినీగేయ రచయితగా పేరు పొందినవారు. |
| 22. గడియారం వేంకటశేషశాస్త్రి | - | శివభారతం |
| 23. దాశరథి | - | తిమిరంలో సమరం |
| 24. కాటూరి వేంకటేశ్వరరావు | - | సౌందరనందము |
| 25. శ్రీపాదకృష్ణమూర్తి | - | బొబ్బిలియుద్ధం, రామాయణ భారత, భాగవతాలు. |
| 26. ఏనుగు లక్ష్మణకవి | - | భర్తృహరి సుభాషితములు (తెలుగు) |
| 27. వేమన | - | వేమన పద్యాలు |
| 28. కంచెర్ల గోపన్న | - | దాశరథీ శతకము |
| 29. మారన | - | భాస్కర శతకము |
| 30. నృసింహకవి | - | కృష్ణశతకము |
| 31. శేషప్ప కవి | - | నృసింహ శతకము |
| 32. అన్నమయ్య | - | శ్రీ వేంకటేశుని కీర్తనలు |
| 33. త్యాగయ్య | - | త్యాగరాజ కీర్తనలు, రామభక్తుడుగా ప్రసిద్ధి |

## ఇరవై శతాబ్దంలో పేరెన్నిక గన్న కవులు

**1. దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి:** కాలం 19-20వ శతాబ్దాలు. ఇతని గ్రంథాలు ఊర్వశి ప్రవాసము. కృష్ణపక్షం, దేశభక్తి గీతాలు, సినిమా పాటలు, బిరుదులు కళాప్రపూర్ణ పద్మభూషణ్.

**2. కందుకూరి వీరేశలింగం:** కాలం 19-20 శతాబ్దములు. రాజశేఖరచరిత్ర, ఆంధ్రకవుల చరిత్ర, స్వీయచరిత్ర వీరి రచనలు. రాజమండ్రి నివాసి. సంఘ సంస్కర్త.

**3. గుర్రం జాషువా :** గబ్బిలం, ఫిరదౌసి - వీరి రచనలు. పద్మభూషణ్ బిరుదాంకితులు.

**4. శ్రీశ్రీ:** కాలం 20వ శతాబ్దం. పూర్తిపేరు శ్రీరంగ శ్రీనివాసాచార్యులు. మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి, మరో ప్రస్థానం, ఈయన ప్రజాకవిగా, విప్లవకవిగా సినిమా కవిగా పేరుగాంచెను.

**5. గురజాడ అప్పారావు:** కన్యాశుల్కం, కొండుభట్టీయం, ముత్యాలసరాలు, నీలగిరి పాటలు వీరి రచనలు. ఈయన వ్యవహారిక భాషావాది.

**6. రాయప్రోలు సుబ్బారావు:** వీరి దేశభక్తి ప్రశంసనీయము. వీరు 1. రమ్యాలోకం, 2. జడకుచ్చులు అను గ్రంథములను రచించిరి.

**7. పానుగంటి లక్ష్మీ నరసింహారావు :** పిఠాపుర సంస్థాన కవి. విజయరాఘవము, ప్రచండ చాణక్యము, బుధబోధసుధ పారిజాతాపహరణం అను గ్రంథములను రచించిరి. వీరి 'సాక్షి' వ్యాసములు పేరి ప్రసిద్ధులైరి.

**8. విశ్వనాథ సత్యనారాయణ:** జన్మస్థలం కృష్ణాజిల్లా నందమూరు. శతాధిక గ్రంథ కర్తలు; విమర్శకులు. సంస్కృతాంధ్రాలలో దిట్ట. పండితుడు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి. కథ, కావ్యం, నాటకం, సాహిత్యం, గ్రంథ సమీక్షల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారు. అన్ని సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసిరి. వీరి రచనలు 1. శ్రీమద్రామాయణ కల్పవృక్షము. 2. ఆంధ్రప్రశస్తి, 3. శృంగారవీథి, 4. భ్రమరగీతం, 5. కిన్నెరసాని పాటలు, 6. వేయి పడగలు 7. ఏకవీర 8. చెలియలికట్ట 9. పునర్జన్మం, 10. స్వర్గానికి నిచ్చెనలు మున్నగునవి.

**9. చిన్నయసూరి :** వీరు 'నీతిచంద్రి'కను రచించి వచన రచనకు చక్కని మార్గమును చూపిరి. బాల వ్యాకరణము తెలుగు భాషకు పరమ ప్రామాణిక గ్రంథము.

**10. డా. సి. నారాయణరెడ్డి:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి. జ్ఞానపీఠ అవార్డు అందుకున్న రెండవ తెలుగు కవి, గ్రంథములు: కర్పూర వసంతరాయలు, విశ్వంభర, నవ్వని పువ్వు, లెక్కకు మించిన మిక్కిలిగా సినిమా పాటలు కలవు.

**విశ్వనాథ వారికి తెలుగు భాషపై గల మక్కువను ఒకే సీస పద్యంలో వర్ణించిన సౌరు, తీరు చూడండి!**

**ఒక్క సంగీతమేదో పాడునట్లు భా**
**షించునపుడు వినిపించు భాష**
**విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు స్ఫు**
**ష్టోచ్చారణంబున నొనరు భాష**
**రస భావముల సమర్పణ శక్తియందున**
**అమరభాషకు దీటైన భాష**
**జీవులలో నున్న చేవయంతయు చమ**
**త్కృతి పల్కులను సమర్పించు భాష**
**తే॥గీ॥ భాషలౌక పది తెలిసిన ప్రభువు చూసి**
**భాషయన నిద్దియని చెప్పబడిన భాష**
**తనదు ఛంధస్సులోని మందమ్ము నడక**
**తీర్చి చూపించినట్టిది తెలుగు భాష!**

- యంటూ కవిసామ్రాట్, తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ వారు వక్కాణించి చెప్పిన పద్యాన్ని సదా స్మరించుకోవాలి.

## నీతి పద్యం

**అతి బాల్యములోనైనను**
**ప్రతికూలపు మార్గములఁబ్రవర్తింపక స**
**ద్గతిమీద మెలగనేర్చిన**
**నతనికి లోకమున సౌఖ్యమగును కుమారా!**

- మొక్కయి వంగనిదే మ్రానై వంగదు అంటారు. చిన్నతనమందైననూ చెడు మార్గాల్లో నడువక, చెడ్డ పనులు చేయకుండా మంచి పనులు చేస్తూ ఎవరుంటారో వారు ముందు ముందు సుఖమును అనుభవించగలరు.

## శ్రావణమాసము ధన్యత చెందె - అష్టమీ రోహిణి కృష్ణాష్టమాయె!

ఆషాఢ, శ్రావణ భాద్రపద మాసత్రయం ఎంతటి పవిత్రమైనవో చెప్పంగ జాలను అన్నాడో కవి వరేణ్యుడు. సత్యం చెప్పాలంటే ప్రతీ మాసానికీ, ప్రతీ ఋతువుకీ భగవంతుడు ప్రత్యేకతను సంతరింపచేశాడు.

ముఖ్యంగా ఈ మూడు మాసాల్లోనూ గురుపూర్ణిమ (ఆషాఢ పూర్ణిమ) నుంచీ వరలక్ష్మీ వ్రతం, వరాహ జయంతి, హయగ్రీవ జయంతి, యజ్ఞోపవీత ధారణ చేసే శ్రావణపూర్ణిమ, జగద్గురువుగా కీర్తిపొందిన గీతాచార్యుడు శ్రీకృష్ణుని జన్మాష్టమి పర్వాలొస్తాయి. యతులు, సాధువులు, పీఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేస్తారు. వర్షాలు సమృద్ధిగా కురియడంతో ప్రకృతి పచ్చపచ్చగా జీవన విధానాన్ని గడుపుతారు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః**

- అంటూ భగవానుడు కృష్ణుడు శరణాగత వైశిష్ట్యాన్ని, కర్మానుష్టానాన్నీ బోధిస్తూ జగత్తును జాగరూకత పరిచే దివ్యగ్రంథం 'భగవద్గీత'ను అర్జునుణ్ణి ఉద్దేశిస్తూ అందచేశాడు.

శ్రీమన్నారాయణుని అవతారాల్లో శ్రీరామ శ్రీకృష్ణ అవతారాలే పరిపూర్ణ అవతారాలు. ఆచరించదగిన ధర్మాన్ని బోధించిన శ్రావణ మాసం ధన్యత చెందె, రోహిణి చరితార్థమొందె అష్టమి తిథి ఏ పుణ్యమొనర్చెనో కృష్ణజన్మాష్టమిగా పర్వమయ్యెను అన్నారు కవులు.

**సింహామాసే2సిత్ పక్షే రోహిణ్యామష్టమీ తిథౌ**
**చరమార్థ ప్రదాతారం కృష్ణం వందే జగద్గురుమ్!**

సింహమాసమంటే శ్రావణమాసంలో కృష్ణ పక్షమున అష్టమీ తిథి రోహిణీ నక్షత్రమందు ఆయన దేవకీ గర్భసంజాతుడై అవతరించాడు.

ఆంధ్రదేశంలోని గ్రామ గ్రామాన ఉట్లు కట్టి, కళ్లకు గంతలు కట్టుకుని ఉట్ల ఉత్సవం వైభవంగా జరుపుతారు. పౌరాణికులు కృష్ణుని లీలల్ని వర్ణిస్తారు.

**కదార విందం పదారవిందం ముఖారవిందే వినియే శయంతం**
**వటస్య పత్రస్యపుటే శయనం బాల ముకుందం మనసా స్మరామి**

- అని ఆ శ్రీకృష్ణుని రూపం వటపత్ర శాయిగా భక్త కోటి హృదయాలలో సుస్థిరంగా నిలిచిపోయింది. ఆయన బోధించిన భగవద్గీత ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో శ్లోకాలను వల్లిస్తూ, ఆయా భాషల్లో వ్యాఖ్యానాలను చేసింది. జాతిపిత గాంధీ మహాత్ముడు సహితమూ భగవద్గీతను ప్రామాణికంగా, నిత్యపఠనీయంగా చేసుకున్నాడు.

**తతో2ఖిల జగత్పద్మ బోధాయాచ్యుత భానునా**
**దేవకీ పూర్వ సంధ్యాయాం ఆవిర్భూత మహాత్మనా!**

- అంటూ భక్తుల కొంగు బంగారమూ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన కృష్ణుడు దేవకీ దేవి పూర్వ సంధ్యలో ఉదయించి, లోక కంటకులను సంహరించి, ఆశ్రితుల పాలిట చల్లని వెన్నెలలను ప్రసరింపచేస్తూ, గో, గోప, గోపికా ముక్తిని ప్రసాదించినవాడయ్యాడు. ధర్మానికి గ్లాని కలిగినపుడు తాను అవతరిస్తానన్న తాండవకృష్ణునికి అంజలి ఘటిద్దాం.



# స్వర్గ సుఖాల నెన్నడూ కోరవద్దు. అది నికృష్టమైన భ్రాంతి.

- స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

ఓ భారతీయులారా! ఇతరుల వెంటపడి పాకులాడే ఇలాటి పరానువాదంతో, ఈ పరానుకరణంతో, ఈ పారతంత్ర్యంతో ఈ దాస్య దౌర్బల్యంతో, ఈ నీచ నిందిత క్రౌర్యంతో, ఈ సంపదలతోనేనా విజ్ఞాన గౌరవ శిఖరాల నధిరోహింప తలస్తున్నారా? మహోచ్ఛాధికారాన్ని పొందదలచుకొన్నారా? వీరభోగ్యమైన స్వాతంత్ర్యం మీ లజ్జాకరభీరుత్వంచే ఎన్నడైనా మీకు లభిస్తుందా?

ఓ భారతజననీ, నీ సమాజం అనంత జగన్మా తృత్వానికి ప్రతిబింబమనే మాట మరువవద్దు. నిమ్నజాతులనబడే దళితులు, దీనులు, దరిద్రులు, అజ్ఞానులు, నిరక్షరాస్యులు – నీ తోబుట్టిన వారనే మాట మరువవద్దు.

ఓ వీరభారతమాతా! ధైర్యం వీడకు. "నేను భారతీయుణ్ణి, ప్రతి భారతీయుడు నా సోదరు"డని ప్రకటించు. జీర్ణ వస్త్రధారియైన, కటిమాత్ర వస్త్రధారియైన నీవూ సగర్వంగా ఎలుగెత్తి ఇలా ఘోషించు – "భారతీయుడు నా సోదరుడు, భారతీయుడు నా ప్రాణం, భారతీయ దేవతలే నా దైవతం. భారత సమాజం నా బాల్యడోలిక. యౌవననందనవనం, వార్ధక వారణాశి" సోదరా! ఇలా చాటు. "భారతభూమి నా మహోన్నత స్వర్గం. భారతదేశ శ్రేయమే నా శ్రేయం" అహర్నిశలూ ఇలా ప్రార్థించు –

"ఓ గౌరీశ్వరా! ఓ లోకేశ్వరా! నాకు మానవత్వాన్ని ప్రసాదించు! నా దౌర్భల్యాన్ని తొలగించు. నన్ను ధీరమానవునిగా తీర్చిదిద్దు!"

– స్వామి వివేకానంద

★ ★ ★

ఈ మాసం గురుపూర్ణిమ. ఈ పుణ్యదినాన గురుస్మరణ చేసుకోవడం ఎంతో మంచిది. అందుకే నేను అభిమానించే గురుదేవులు వివేకానంద స్వామిని ముఖచిత్రంగా ప్రచురించడం జరిగింది. మన పెద్దలు అంటే గురువులు వేదాలలో "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అని చెప్పారు. మొట్టమొదటి గురువు తల్లి నవమాసాలు మోసి, ప్రేమతో లాలించిన తల్లిని దైవంగా ఆరాధించాలి. మాతృదేవతను పూజించనివారికి దైవదర్శనం కలుగదు. పిదప కుటుంబ భారాన్ని మోస్తూ అహర్నిశలు శ్రమిస్తూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, సక్రమ మార్గంలో నడిపే గురువుగా భావించి ఆయన అడుగుజాడలలో నడుస్తూ ఆయన్ని దైవసమానునిగా ఆరాధించాలి. తరువాత గురువుని భక్తిపూర్వకంగా ఆరాధించాలి. జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు. దైవాన్ని చూపించేవాడు గురువు. అట్టి గురువును దైవంగా భావించాలి.

**గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు । గురుర్దేవో మహేశ్వరః ॥**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ । తస్మై శ్రీ గురవే నమః ॥**

గురువును త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులతో పోల్చటమే కాక అట్టి గురువులను వినయ విధేయలతో, భక్తిశ్రద్ధలతో కొలవమని చెప్పారు. అందుకే గురువు, దైవం ఎదురుగా కనపడితే ముందుగా గురువుకే నమస్కరించ మన్నారు. అలాగే అతిథిని దైవసమానంగా కొలవమని చెప్పారు. దైవమే అతిథి రూపంలో రావచ్చు. కావున అతిథి సేవ భగవంతుని సేవతో సమానము. కాబట్టి తల్లి, తండ్రి, గురువు, అతిథులను దైవముగా భావించి, సేవించినచో దేవుని యొక్క అనుగ్రహం తప్పక లభిస్తుంది. గురువులేక సృష్టిలో ఏ ఉత్తమ మానవుడైనా శ్రేయస్సును పొందజాలడు. అందుకే ప్రహ్లాదుడు వంటి జ్ఞానులు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతార పురుషులు కూడా గురువును అనుసరించి ఆదర్శముగా నడుచుకొన్నారు. అందుకే అందరికి సద్గురువుల యొక్క అవశ్యకత ఎంతైనా వుంది.

★ ★ ★

నాకు నూరుమంది యువకులనివ్వండి. నేను ఈ దేశాన్ని తీర్చిదిద్దుతానని వివేకానందుడు అడిగాడు. 100 కోట్ల జనాభాగల ఈ దేశంలో ఆయన చెప్పి వంద సంవత్సరాలైనా ఇంతవరకూ 100 మంది యువకులను తయారుచెయ్యలేకపోయాం. ఆయన తరువాత కనీసం ఒక్క గురువు కూడా ఆయన మార్గంలోనివారు నాకు కనిపించలేదు. ఆయన ఏదైతే వద్దన్నారో అదే మనం చేస్తున్నాం. ఆంధ్రదేశంలోని విద్యార్థులు ఎన్ని పరీక్షల్లో ర్యాంక్‌లు సాధించినా, వారి బొమ్మలతో పూర్తి పేజీ ప్రకటనలతో నిండిపోయినా విలువలు శూన్యంగానే వున్నాయి. దానికి ఈమధ్య ప్రేమ పేరుతో జరుగుతున్న హత్యలే కారణం. నైతిక విలువలంటే ఈ కాల యువతీయువకులకు అర్థం కావడం లేదు. సుఖజీవితానికి అలవాటుపడ్డ మనుషులు కష్టానికి జడుస్తు న్నారు. విలువలు లేని విలాసవంతమైన జీవితానికి అలవాటుపడుతున్నారు. అన్నదమ్ములలో కూడా ఒకరి కష్టం ఒకరికి పట్టనట్టు వుంటున్నారు. తన పిల్లలు తన కుటుంబ సుఖాన్నే కోరుకుంటున్నారు. దీనిని న్యూక్లియర్ ఫ్యామిలీ అంటారుట. పాశ్చాత్య దేశాలన్నీ ఇపుడు మన వేదాలను అనుసరిస్తూ మన జీవన విధానం గొప్పదంటూ వుంటే మనమేమో వారి జీవన విధానాన్ని అవలంభించడానికి ప్రయత్నిస్తున్నాం. ఇదెంతవరకూ దారితీస్తుందో తెలియని అయోమయ స్థితిలో వున్నాం.

యువతీ యువకులందరూ చిన్న వయసులోనే ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించాలి. ఇతరులను చూసి పెడదోవలో పోకూడదు. మనం ఎటువంటి వారితో స్నేహం చేస్తామో అటువంటి బుద్ధులే మనకు అలవడతాయి. నైతిక విలువలు లేనివాడు మనిషి కాదు. నైతిక విలువలను పెంచుకోవడమే నిజమైన విద్య. నైతిక విలువ లేకుండా ఎంత చదువు చదివినా ఎంత పెద్ద ఉద్యోగం చేసినా, ఎంత పెద్ద పదవిని అలంకరించినా అంతా వ్యర్థమే. చెడుని నాలుగు చెవులతోను, నాలుగు కళ్ళతోను చూస్తున్నామే కాని, మంచి మాటలు వినడానికి మనసొప్పడం లేదు. వినాశకాలే విపరీత బుద్ధి అన్న చందంగా ఉంటున్నాము.







అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**July 2022**










# The One Stop solution for all your Printing Needs

## GOTETI GRAPHICS

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***